Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 17.03.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 41 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# న(వ)మో భారత్

- దేశ చరిత్రలో కొత్త అధ్యాయం
- పేదింటి నాయకుడి అద్భుత విజయం
- లక్ష్య సాధన దిశగా కాంగ్రెస్ విముక్త భారత్
- మోడీ దెబ్బకు కుదేలవుతున్న ప్రతిపక్షం
- యూపీలో చరిత్రాత్మక గెలుపుతో ఆకాశాన్నంటిన మోడీ ఇమేజ్

**భారతదేశ చరిత్ర మారుతోంది... కుటుంబ రాజరిక వ్యవస్థ నుండి సామాన్య జనావళి వైపుకు చరిత్ర మళ్ళుతోంది. ఇంతకాలం సంపన్న కుటుంబాలలో పుట్టిన నాయకుల చరిత్రను, తండ్రి, తాతల వారసత్వంతో రాజకీయాలను శాసించిన నాయకురాళ్ళ చరిత్రను చదువుకున్న భారతం... భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ఛాయ్‌వాలా సాధించిన తన అద్భుతాలను చరిత్రగా చదువుకోబోతుంది. ఇది నిజం.**

స్వాతంత్ర్యానంతరం భారత ప్రజాస్వామ్య దేశంలో మనకు అత్యంత శక్తివంతమైన నాయకులుగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, స్వర్గీయ ఇందిరాగాంధీలు కనిపిస్తారు. భారత రాజకీయ వ్యవస్థలో దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలను ప్రభావితం చేసింది, ప్రభంజనాలు సృష్టించింది వాళ్ళు మాత్రమే! అయితే వీరికి ఒక బేస్‌మెంట్ వుంది. నెహ్రూది

(మిగతా 11వ పేజీలో)

## • 'దేశం' ముందర...

# నంద్యాల 'ఉప'ద్రవం!

## భూమా మృతితో బాబుకు కొత్త చిక్కు


**కర్నూలు జిల్లాలో హఠాన్మరణం చెందిన భూమా నాగిరెడ్డిని కోల్పోవడం ఒక లోటైతే, ఆయన మృతితో రానున్న నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సవాల్‌గా మారనున్నాయి. నంద్యాల సీటు మాదే... కాబట్టి మేము పోటీ చేయడం ఖాయమంటూ వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో 2019లో డైరక్ట్‌గా ఫైనల్ మ్యాచ్ ఆడాలనుకుంటున్న చంద్రబాబుకు 'నంద్యాల' రూపంలో సెమీ ఫైనల్స్ ఆడాల్సివస్తోంది.**

రాష్ట్రంలో ఏ ఒక్క అసెంబ్లీకి కూడా ఉపఎన్నికలు జరిపించడం చంద్రబాబుకు ఇష్టం లేదు. అలా జరిగి తెలుగుదేశం బోర్లా పడితే తమ పతనం అక్కడనుండే మొదలవుతుందని, ఒక అసెంబ్లీ ఎన్నిక ప్రభావం మొత్తం రాష్ట్రంపై పడుతుందని చంద్రబాబు భయం. ఆ భయంతోనే ఆయన ఏదో ఒక ఎమ్మెల్యే చేత రాజీనామా చేయించి తన కొడుకు లోకేష్‌ను ఉపఎన్నిక ద్వారా శాసనసభకు పంపించే అవకాశమున్నా, ఆ సాహసం చేయలేక శాసనమండలికి పంపించాడు.

ఇప్పుడు నంద్యాల ఉపఎన్నికను తప్పించుకోలేని పరిస్థితి. మన రాష్ట్రంలో ఒక సాంప్రదాయం వుంది. ఏ పార్టీకి చెందిన సభ్యుడైనా చనిపోతే, ఆ నియోజకవర్గానికి జరిగే ఉపఎన్నికల్లో సదరు సభ్యుడి కుటుంబసభ్యులు పోటీచేస్తే ప్రతిపక్షం పోటీ పెట్టదు. అయితే ఇంతవరకు ఆ విధంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన వారంతా కూడా పార్టీ గుర్తు మీద గెలిచాక ఆ పార్టీలో ఉంటూ చనిపోయిన వాళ్ళే! కాని, ఇక్కడ భూమా నాగిరెడ్డి 2014 ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నుండి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా గెలిచాడు. ఏడాది తర్వాత తెలుగుదేశంలో చేరాడు. ఇప్పుడు తెలుగుదేశం నాయకుడిగా మృతిచెందాడు. కాబట్టి నంద్యాల అసెంబ్లీ సీటు మాది అన్నది జగన్ వాదన. ఆ సీటు మాది కాబట్టే మేం పోటీకి దిగుతామంటున్నాడు.

జగన్ వాదనతో ఏకీభవించి చంద్రబాబు అభ్యర్థిని పెట్టకుండా ఉండలేడు, ఖచ్చితంగా పోటీ పెట్టాల్సిందే! మరణించిన నాయకుడి కుటుంబసభ్యులను పోటీకి దించితేనే కొంతన్నా సానుభూతి ఉంటుంది. కాని ఇక్కడ చూస్తే నాగిరెడ్డి పెద్దకూతురు అఖిలప్రియ ఎమ్మెల్యేగా ఉన్నారు. రెండో కూతురు, కొడుకు చిన్నపిల్లలు. వారిని పోటీకి దించడం కష్టమే! ఆ కుటుంబసభ్యులు


(మిగతా 11వ పేజీలో)



# బడ్జెట్టు... కనికట్టు

## అంకెల గారడీ... ఆశలతో బురిడీ

బాబుగారి బడ్జెట్ అంతా బడాయి బడ్జెట్‌గానే వుంది. కాకిలెక్కలతో.. అరచేతిలో వైకుంఠం చూపిస్తూ బడ్జెట్ ఎంత గొప్పగావుందో అన్నట్లుగా అత్యద్భుతంగా రూపొందించారు. ఒకవైపు రాష్ట్రం అప్పుల నిప్పుల్లో కాగిపోతోందంటూనే, బడ్జెట్ వచ్చేసరికి భారీగా కేటాయింపులు చేసేయడం ఎలా కుదురుతోందో మరి! (మిగతా 11వ పేజీలో)



# ఇఫ్కోపై స్టే పొడిగింపు

కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌పై వున్న స్టేను హైకోర్టు మూడువారాలు పొడిగించింది. ఆ మేరకు జస్టిస్ రమేష్ రంగనాధన్‌తో కూడిన బెంచ్ మంగళవారం ఈ విషయం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సెజ్‌లో కోకాకోలా లాంటి కాలుష్యకారక పరిశ్రమల అనుమతి నిలిపివేయాలని, రైతుల నుంచి సేకరించిన భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని కోరుతూ జడ్పీటిసి శ్రీధర్‌రెడ్డి, మరో ముగ్గురు రైతులు హైకోర్టులో రిట్ వేశారు. దాంతో, సెజ్‌లో ఎలాంటి పనులు చేపట్టరాదని హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. అయితే, స్టేటస్కో వున్నప్పటికీ సెజ్ పరిధిలోని గమేసా ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతుండడంతో పైన పేర్కొన్న రైతులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అదేరోజు సెజ్‌పై వున్న స్టేటస్‌కోను ఎత్తివేయాలని కోరుతూ ఇఫ్కో తరపున కేంద్రప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, విశాఖపట్నం సెజ్ డెవలప్‌మెంట్ కమిషన్‌లు హైకోర్టులో పిటిషన్ వేశాయి. దీనిపై జనవరి 30న హైకోర్టులో విచారణ జరగాల్సివుండగా, ఇఫ్కో కిసాన్‌సెజ్ నుంచి కౌంటరు దాఖలు చేయకపోవడంతో ఈ నెల 15వ తేదికి ఆరువారాల పాటు వాయిదా వేయడం తెలిసిందే. అయితే, మంగళవారం నాటికి కూడా ఇఫ్కో సెజ్‌నుంచి కానీ, గమేసా ఫ్యాక్టరీనుంచి గానీ ఎలాంటి కౌంటర్లు దాఖలు కాకపోవడంతో మరో మూడువారాల పాటు ఇఫ్కోపై స్టేను పొడిగించినట్లు సమాచారం.

# వీఆర్‌సిలో 'గెస్ట్ లెక్చర్' ప్రోగ్రాం




నెల్లూరు వీఆర్ కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం ఎంఏఎస్ఆర్ గ్రంథాలయ ఆధ్వర్యంలో "గెస్ట్ లెక్చర్"వ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా॥ సి.వి.యస్ భాస్కర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గ్రంథాలయాల ఆవశ్యకత, వాటి వినియోగ ప్రాముఖ్యత, పోటీ పరీక్షల కొరకు విద్యార్థులు నిరంతరం గ్రంథాలయ పుస్తక పఠనం చేసిన వారే పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. వైస్‌ప్రిన్సిపాల్ డా॥ అశోక్‌రావు మాట్లాడుతూ ఎవరైతే నిరంతర పుస్తక పఠనం చేస్తారో వారే జీవితంలో మంచి స్థానాన్ని అధిరోహిస్తారని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో గూడూరు డిఆర్‌డబ్ల్యు కాలేజీ లెక్చరర్ ఇన్ లైబ్రరి సైన్స్ డా॥ అనూరాధ, వి.ఆర్ కళాశాల గ్రంథాలయాధికారి డా॥ నరమాల ప్రభాకర్, అధ్యాపకులు డా॥ బాబర్ ఆలీ మొహిద్దీన్, డా॥ రవీంద్రరెడ్డి, డా॥ జి.సురేంద్ర, గంధం వేణు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరజీవిని విస్మరించారు

## - కెవి చలమయ్య ఆవేదన



ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన త్యాగ ధనుడు శ్రీ పొట్టి శ్రీరాములు 117వ జయంతిని ప్రభుత్వం విస్మరించడం దారుణమని ఏపి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కెవి చలమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 16న శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన నెల్లూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ శ్రీ పొట్టి శ్రీరాములుకు నివాళు లర్పించి మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగానే ఆంధ్రరాష్ట్రం అవతరించిందని, నేటి తరానికి ఆ మహనీయుడు ఆదర్శప్రాయులన్నారు. అనంతరం కెవి చలమయ్య మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలను ప్రతిఏటా ప్రభుత్వం నిర్వహించాలని, శ్రీరాములు కాంస్య విగ్రహం అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని, ఆ త్యాగధనునికి 'భారతరత్న' పురస్కారాన్ని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆర్‌కెటి శేషయ్య, ఎస్.నాగేశ్వరరావు, పిఎస్ఆర్ రాము, ఆర్‌వి శరత్, ఎన్.రవికుమార్, దాసా సురేష్‌రాజా పాల్గొన్నారు.

# నకిలీ పోలీసుల అరెస్ట్

వచ్చే, పోయే ఆటోలను ఆపి పోలీసులమంటూ బెదిరిస్తూ వసూళ్ళకు పాల్పడుతున్న ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు నెల్లూరురూరల్ సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు. నెల్లూరు శివారు ఇరుకళల పరమేశ్వరి గుడి సెంటర్‌లో పోలీసులమని చెప్పి వాహనాలను ఆపి ఇద్దరు వ్యక్తులు అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారన్న సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్ళి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరు నెల్లూరు నీలగిరి సంఘానికి చెందిన మురళీధర్, న్యూమిలిటరి కాలనీకి చెందిన మోహన్‌గా గుర్తించినట్లు తెలిపారు.

# నేత్రపర్వంగా లక్ష్మీ సుదర్శన యాగం



నెల్లూరుజిల్లా రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో కొలువైన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న మహాసుదర్శన యాగం, మహ పూర్ణాహుతి, కుంభప్రోక్షణతో ఆదివారం ముగిసింది. ఉదయం శ్రీవారి అలంకార మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో శోభాయ మానంగా అలంకరించి, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో యాగశాలకు తీసుకొచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పెంచలకోన క్షేత్రం ఎంతో మహిమగల క్షేత్రమని రామచంద్ర రామానుజజీయర్ స్వామి పేర్కొన్నారు. మహాపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైష్ణవ క్షేత్రాల్లో పెనుశిల లక్ష్మీనరశింహ క్షేత్రం ఎంతో అరుదైందన్నారు. ఈ క్షేత్రంలో స్వామి అమ్మవార్లు పెనవేసుకుని ఉంటారని, ఇలాంటి విగ్రహం దేశంలో ఎక్కడాలేదన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో ఇక్కడ పూజలు నిర్వహిస్తే భగవంతునికి చేరువవుతారన్నారు. సాధారణంగా ఆలయాల్లో ఒక జీయర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు, యాగాలు జరుగుతాయని, పెంచలకోనలో మహ సుదర్శన యాగానికి ముగ్గురు జియ్యర్ స్వాములు రావడం అరుదన్నారు. ప్రతి ఒక్కరూ వేద, ప్రబంధ పారాయణాలు చేయాలని, దేవస్థానంలో వేద సభలను నిర్వహించాలని కోరారు. మహాసుదర్శన యాగం ముగింపు సందర్భంగా మహ పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జియర్ స్వాములు, టిటిడి వేద పండితులు, స్థానిక అర్చకుల ఆధ్వర్యంలో పెనుశిల లక్ష్మీనరశింహస్వామికి మహాసుదర్శన యాగం, మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. టిటిడి జెఇఒ శ్రీనివాసరాజు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, శ్రీకాళహస్తి దేవస్థాన పాలకవర్గ అధ్యక్షుడు గురవయ్యనాయుడు, గూడూరు డిఎస్పీ శ్రీనివాస్, టిడిపి నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవస్థాన పాలకవర్గ అధ్యక్షుడు తానంకి నానాజీ, ఇఓ రామ్మూర్తి, పాలకవర్గ సభ్యులు, జ్యోతమ్మ, సోమయ్య, గోపాల్, చిన్నయ్య, హరనాథ్‌రెడ్డి, గోపాల్‌నాయుడు పాల్గొన్నారు. మహాసుదర్శనయాగం సందర్భంగా టిటిడి తరపున జెఇఒ శ్రీనివాసరాజు, శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. దేవస్థాన అధికారులు, టిటిడి వేద పాఠశాల పండితులు స్వాగతం పలికారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, ఆంజనేయస్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. డాలర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## 21 నుంచి

# ముత్యాలమ్మ జాతర

ఈనెల 21 నుంచి 23వ తేది వరకు తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర వైభవోపేతంగా జరుగనుంది. ఆ మేరకు మంగళవారం రాత్రి తొలి చాటింపు వేశారు. తీరప్రాంతంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసివున్న గ్రామదేవత ముత్యాలమ్మ జాతరకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటుంటారు. చాటింపులో భాగంగా, తొలుత పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేసి, అనంతరం దప్పులతో జాతర చాటింపు వేశారు. అదేవిధంగా, ఈ నెల 19వ తేదీన ఘటోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీసిటీలో నిట్సు లాజిస్టిక్

నిపాన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపుకు చెందిన నిట్సు లాజిస్టిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నూతన గోదాము కేంద్రాన్ని బుధవారం నెల్లూరుజిల్లా తడ మండలం శ్రీసిటిలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా నిపాన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ దక్షిణ ఆసియా మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రీజనల్ జనరల్ మేనేజర్ యసూనోరిటకా హోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇది 7వ యూనిట్ అని, చెన్నై పరిధిలోని పలు ఆటోమోటివ్ పరిశ్రమలకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని తెలిపారు. చెన్నైలోని జపాన్ కాన్సిల్ జనరల్ సిజి బాబా, శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి, నిట్సు లాజిస్టిక్ ఇండియా ప్రెసిడెంట్ మాసాటో ఆసాగి పాల్గొన్నారు.

# విఎస్‌యుకు కొత్త రిజిస్ట్రార్

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా ఎం.చంద్రయ్యను నియమించారు. ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ యూనివర్శిటీలో ఎన్నో వివాదాలకు కేంద్రంగా మారిన ప్రొఫెసర్ శివశంకర్‌ను ఆయన పాత స్థానమైన కావలి పీజీ సెంటర్‌కు పంపారు. రిజిస్ట్రార్‌గా తన పదవీ కాలాన్ని పొడిగించుకోవడానికి శివశంకర్ చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో ఆయన పాత చోటుకే వెళ్ళాల్సి వచ్చింది. చంద్రయ్య ఈసీ మెంబర్‌గా వుంటూ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. అలాగే యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వున్న వెంకటరావును కావలి పీజీ సెంటర్‌కు ప్రొఫెసర్‌గా పంపారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ అందె ప్రసాద్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించారు. టూరిజం విభాగానికి చెందిన జవహర్‌బాబును వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఇప్పటివరకు యూనివర్శిటీ పిఆర్‌ఓగా పనిచేసిన నరసింహారావు పదోన్నతిపై వెళ్ళడంతో ఆయన స్థానంలో కెమిస్ట్రీ విభాగానికి చెందిన పి.వీరారెడ్డిని నియమించారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య మూడునెలల పాటు కొనసాగుతారు. ఆ తర్వాత ఈసీ సమావేశంలో చర్చించి రిజిస్ట్రార్‌గా ఎవరిని నియమించాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ వీరయ్య తెలిపారు.

# ముగిసిన అంతర్ కళాశాలల క్రీడాపోటీలు




నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మూడురోజులుగా జరిగిన అనంతపురం జెఎన్‌టియూ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడాపోటీలు బుధవారం ముగిసాయి. ఈ పోటీల్లో యూనివర్శిటీ పరిధిలోని 43ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 1250మంది పురుషులు, 300 మంది మహిళలు పాల్గొన్నారు. చివరిరోజు హోరాహోరీగా జరిగిన పోటీల్లో విజేతలకు స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి జోజిరెడ్డి, ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. బుధవారం అంతర కళాశాల క్రీడాపోటీల్లో విజేతలకు షీల్డులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రికి విపిఆర్ అంబులెన్స్




నెల్లూరులోని పెద్దాసుపత్రికి అత్యవసర సేవలకోసం వినియోగించే అంబులెన్స్ లేని కొరతను ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గమనించి, రోగుల సహాయార్థం అంబులెన్స్‌ను సమకూర్చి తన వదాన్యతను చాటుకున్నారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రాణాపాయస్థితిలో వున్నప్పుడు అంబులెన్స్ ఎంతో అవసరమన్నారు విపిఆర్. మెరుగైన వైద్యానికి తరలించేలోపు ప్రథమ చికిత్స ఎంతో కీలకమని, ప్రభుత్వ వైద్యసేవలకు తోడ్పాటుగా అత్యాధునిక వసతులతో కూడిన అంబులెన్స్ ఎంతో అవసరం వుందని, ఈ విషయాలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రజల సేవ కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి సరికొత్త వసతులతో నూతన అంబులెన్స్‌ను అందజేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సి.రాధాకృష్ణరాజు సమక్షంలో అంబులెన్స్ వాహనాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డితో పాటు, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, విపిఆర్ ఫౌండేషన్ సిఇఒ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రక్షిస్తారా... శిక్షిస్తారా?



## సిఎం హైస్కూల్ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నవారిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కోటంరెడ్డి

నెల్లూరు, మూలాపేటలోని 110 ఏళ్ళ చరిత్ర కలిగిన సిఏఎం హైస్కూల్ ఇక చరిత్రగా మిగిలిపోయే ప్రమాదం... 1905లో అమెరికాకు చెందిన దాతల విరాళాలతో 20.63ఎకరాల స్థలంలో నిర్మించబడ్డ ఈ విద్యాలయం ఇప్పుడు శిథిలావస్థకు చేరిందనేకంటే కూడా చేర్చారని చెప్పడం కరెక్ట్! విద్యార్థులు లేరనే సాకుతో సుమారు మూడేళ్ళ నుండి ఈ విద్యాసంస్థను మూసేసారు. సిఏబిసి అనే క్రిస్టియన్ సంస్థ ఏపిలోని మిషనరీ ఆస్తులపై పెత్తనం చేస్తూ ఒక్కో ఆస్తిని తెగనమ్ముకుంటూ వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే క్రైస్తవ మిషనరీలకు చెందిన విద్యా, వైద్య సంస్థలకు చెందిన వందల కోట్ల విలువచేసే స్థలాలను అమ్మే యడం, వాటిలో ఇతర వ్యాపార రంగాల నిర్మాణాలు జరగడం కూడా అయిపోయింది. ఈ కోవలోనే ఇప్పుడు సిఏఎం హైస్కూల్ చేరిపోయింది. వందల కోట్ల విలువచేసే ఈ విద్యాసంస్థ ఆస్తులను అన్యాక్రాంతం చేసే ప్రయత్నం మొదలైంది. ఈ నేపథ్యంలోనే 'పరివార్ గ్రూప్ హోటల్స్' అనే సంస్థకు సిఏఎం హైస్కూల్‌ను అతి తక్కువ బాడుగతో పాతికేళ్ళ లీజుకు ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. విజ్ఞానగనిగా విరాజిల్లిన సిఏఎం హైస్కూల్ ఈ విధంగా వ్యాపార కేంద్రం కావడాన్ని ఆ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులెవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగని సిఏఎం ఆస్తులను కాపాడాలనేంత ఆసక్తి ప్రభుత్వంలో లేదు.

కాని తన నియోజకవర్గంలో జరుగుతున్న ఈ అన్యాయంపై 15వ తేదీ అసెంబ్లీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పందించారు. క్రైస్తవుల ఆస్తులను పరిరక్షించలేరా అంటూ ప్రభుత్వానికి ప్రశ్నను సంధించారు.



15వ తేదీ సిఏఎం హైస్కూల్ ఆస్తుల అన్యాక్రాంతంపై అసెంబ్లీలో చర్చ జరిగింది. నెల్లూరుజిల్లాలో స్థానిక ఎమ్మెల్సీ ఎన్నిక హడావిడి, జగన్ ఎమ్మెల్యేలను ఇక్కడే ఉండిపొమ్మన్నప్పటికి, 15వ తేదీ సిఏఎం హైస్కూల్ ఆస్తుల అన్యాక్రాంతం చర్చకు వస్తుందని తెలిసి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అది పనిగా అసెంబ్లీకి వెళ్ళారు. ఈ అంశం పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ 110 ఏళ్ళ చరిత్ర కలిగిన సిఏఎం హైస్కూల్ ఆస్తులు అన్యాక్రాంతమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం పద్ధతి కాదని, ఆ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకే పథకం ప్రకారం హైస్కూల్‌ను మూసేసారని ఆయన ధ్వజమెత్తారు. సిఏఎం హైస్కూల్ ఆస్తులు అన్యాక్రాంతం చేసిన వారిపై రౌడీషీట్‌లు తెరవాలని, సిఏఎం హైస్కూల్ ఆస్తులను పరిరక్షించి, అక్కడ క్రైస్తవులకు ప్రత్యేకంగా ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేస్తే దాతల ఆత్మ శాంతిస్తుందని కోటంరెడ్డి చేసిన వాదనతో ఐ.టి., మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కూడా ఏకీభవించారు. కోటంరెడ్డి అక్షరసత్యం చెప్పారన్న మంత్రి, సీఏఎం హైస్కూల్ ఆస్తుల పరిరక్షణ బాధ్యతను కలెక్టర్‌కు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మన ఊర్లో 'మెగా నీరు'



మెగాపవర్‌స్టార్ రామ్ చరణ్‌తేజ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన చిరంజీవి యువత ఆధ్వర్యంలో నెల్లూరు వైయస్సార్ నగర్‌లో ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరందించే పథకాన్ని ప్రారంభించారు. చిరంజీవి యువత జాతీయ అధ్యక్షుడు స్వామినాయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, అపోలో నెల్లూరు యూనిట్ హెడ్ నవీన్‌రెడ్డిలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ నేత్ర దానం, రక్త దానం, దేహ దానాలలో చిరంజీవి యువత ఎప్పుడూ ముందుంటుందని, ప్రస్తుతం మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో ప్రజల దాహార్తి తీర్చడానికి ట్యాంకర్ల ద్వారా మంచినీళ్ళు అందించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టె వెంకటేశ్వర్లు, తురకా అనిత, శేఖర్‌రెడ్డి, రవి, కృష్ణారెడ్డి, సూరి, మునిగిరీష్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# దామ'వరం'కే విమానం?



నెల్లూరుజిల్లాలో విమానాశ్రయాన్ని ఎక్కడ నిర్మించనున్నారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో వై.యస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జాతీయ రహదారిని ఆనుకుని వున్న దగదర్తి మండలంలోని దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు భూసేకరణ కూడా జరిగింది. అయితే ఇటీవల ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టు సెజ్ పరిధిలోగల రిలయన్స్ పవర్ ప్లాంట్ కోసం సేకరించిన భూములను కూడా ఎయిర్‌పోర్టు కోసం పరిశీలించారు. అయితే రిలయన్స్ భూములు స్వాధీనం చేసుకోవడానికి కొన్ని సాంకేతిక పరమైన, పారిశ్రామిక సంబంధిత అడ్డంకులున్నాయి. అదీగాక కృష్ణపట్నం వద్ద ఎయిర్‌పోర్టును జిల్లాలోని పడమర ప్రాంతం నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఒక్క కృష్ణపట్నం పోర్టుకు అనుకూలంగా ఉంటుందనే విషయం తప్పితే ఇంకే విధంగానూ రిలయన్స్ భూముల్లో ఎయిర్‌పోర్టు సమర్థనీయం కాదు. ఇటు నెల్లూరోళ్ళకు, అటు ప్రకాశం జిల్లాకు కూడా మధ్యగా వుండే దామవరం వద్ద ఎయిర్‌పోర్ట్ ఎంతో అనుకూలం. చివరకు ఇదే ఓకే అయినట్లు తెలుస్తోంది. దామవరం విమానాశ్రయాన్ని నిర్మించే పనిని మలేషియాకు చెందిన స్లైపార్క్ సంస్థ ముందుకు వచ్చింది. ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్నాక 18 నెలల్లోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తామని వాళ్ళు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. కృష్ణపట్నం పోర్టును దృష్టిలో పెట్టుకుని ఎయిర్‌పోర్టులోనే వేర్ హౌస్‌ను, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలు కూడా చేపడుతామని ఆ కంపెనీ ప్రతినిధులు 15వ తేదీ అమరావతిలో సీఎం చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో చెప్పడం జరిగింది. తమిళనాడులోని తిరుచునాపల్లి ఎయిర్‌పోర్టు ఆధునీకరణను కూడా ఈ సంస్థే చేపట్టి పూర్తి చేసి ఉండడం విశేషం.

# వెంకయ్యకు బిజెపి నేతల అభినందనలు



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ద్వారా నిరంతరం కృషి చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీని సాధించడమే కాకుండా సాధించిన ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించడం కోసం ప్రయత్నించి విజయం సాధించిన కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు నెల్లూరు బిజెపి నాయకులు తమ కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలిపారు. ఈ నెల 16న నెల్లూరు నుంచి బిజెపి జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి బృందం ఢిల్లీకి వెళ్ళి వెంకయ్యనాయుడును కలుసుకుని తమ అభినందనలు తెలిపారు. అంతేకాక, జిల్లాలోని పలు సమస్యలను కూడా ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు దృష్టికి తీసుకురాగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగంగా వుంటుందని వారన్నారు.

ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ అధికార ప్రతినిధి చర్లపల్లె నారసింహారెడ్డి, ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ కుడుముల సుధాకరరెడ్డి, సీనియర్ నాయకులు ఎన్. చంద్రశేఖరరాజు, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

# రాజకీయ తెరపై కొత్త చరిత్ర



**ఎవరు అభివృద్ధికి పాటుపడుతున్నారో, ఎవరు అధికారం కోసం పాకులాడుతున్నారో ఓటర్లు ఎప్పుడో గ్రహించేశారు. మొన్నటి ఎన్నికల్లో అది మరింత స్పష్టమైంది. పెద్దనోట్ల రద్దు తర్వాత మోదీ ప్రతిష్ట తగ్గిందంటూ విపక్షాలు చేసిన విమర్శలు కూడా చెల్లుబాటు కాలేదు. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, మణిపూర్ ఎన్నికల్లో పంజాబ్ మినహా మిగిలినచోట్ల బిజెపి ప్రజాదరణ పొందింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో బిజెపి సాధించిన చరిత్రాత్మక విజయం ప్రధాని మోదీ సత్తాను చాటింది.**

'చరిత్ర చదవడం కాదు.. చరిత్రను సృష్టించడమే గొప్ప'..ఈ మాట ప్రధాని మోదీ విషయంలో రుజువైంది. ఉన్న అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నతశిఖరాలను అందుకోవడం ఒక ఎత్తయితే, లేని అవకాశాన్ని స్వయంగా సృష్టించుకుని ఆకాశమంత ఎత్తుకు ఎదగడమే మరెంతో గొప్ప. అందులోనూ మన దేశ రాజకీయాల్లో ఎవరూ ఊహించలేనంత గొప్పగా ఎదగడం..దేశవ్యాప్తంగా ప్రజల అభిమానాన్ని పొంది సమున్నతమైన స్థానం సాధించడమంటే మాటలు కాదు. ఈ తరంలో అంతటి విశిష్టమైన స్థాయి..ఒక్క మోదీకే సాధ్యమైందంటే ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు.

మనదేశంలో నెహ్రూ, ఇందిరాగాంధీలకు ఎంతోకాలం నుంచి ఒక మంచి స్థానం వుంది. స్వాతంత్ర్య పోరాటకాలం నుంచి గాంధీ, నెహ్రూ కుటుంబాలు చేసిన సేవలు దేశప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలచిపోయాయి. ఆ అభిమానం నేటికీ చెరిగిపోనిది. అంతటి విశేషాభిమానాన్ని ఆ నేతలు పొందారంటే, ప్రజల్లో గతం నుంచీ వారికి వున్న స్థానం అలాంటిది. అయితే, మోదీది ఆ బాట కాదు. చాలా చిన్నస్థాయి నుంచి జీవితం ప్రారంభించారాయన. ఎక్కడో ఒక టీ దుకాణంలో పనిచేస్తూ జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించారు. అయితే, జీవితమే ఆయనకు అన్నీ నేర్పింది. ఆత్మవిశ్వాసాన్నిచ్చి ముందుకు నడిపించింది. తొలినుంచి మాతృభక్తి-దేశభక్తి అంటే ప్రాణం. అచంచల ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోవడం ఆయన నైజం. అందుకే, ఆయన అంచలంచలుగా ఎదిగారు. రాజకీయరంగంలోకి వచ్చాక ఎవరూ వూహించని విధంగా అనేక ఘనవిజయాలను సాధించారు. అకుంఠిత దీక్షాదక్షతలతో, అసామాన్య ప్రతిభతో రాణిస్తూ..దేశప్రజల అభిమానం పొంది దేశప్రధానిగా అత్యున్నతమైన పదవినధిష్టించగలిగారు. అందుకే, ప్రధాని అయ్యాక మోదీ దేశప్రజల ఆశలు ఆకాంక్షలను నెరవేర్చేందుకు అహరహం శ్రమిస్తున్నారు. మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారు. ఆయనకు ప్రజలపై వున్న విశ్వాసం.. ప్రజలకు ఆయనపై వున్న విశ్వాసం రెండూ విడదీయలేని బంధాలుగా పెనవేసుకుపోయాయి. అందువల్లనే ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ ఆ బంధమే గెలిచింది. అనేకచోట్ల మోదీ జయపతాక..బిజెపి విజయఢంకా మోగించింది. ప్రత్యర్థులైన మహామహులను సైతం ఈ ఎన్నికల్లో ఓడించి బిజెపి తన సత్తా చాటుకుంది.

పెద్దనోట్ల రద్దు తర్వాత మోదీ ప్రతిష్ట తగ్గిందంటూ విపక్షాలు చేసిన విమర్శలు మోదీ అభివృద్ధిమంత్రం ముందు ఏమాత్రం నిలువలేకపోయాయి. ఎవరు అభివృద్ధికి పాటుపడుతున్నారో, ఎవరు అధికారం కోసం పాకులాడుతున్నారో ఓటర్లు ఎప్పుడో గ్రహించేశారు. జనం కోసం పనిచేసేవారికే పట్టం కట్టారు. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, మణిపూర్‌లలో జరిగిన ఎన్నికల్లో పంజాబ్ మినహా మిగిలిన చోట్లలో బిజెపి ముందంజలో నిలిచింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం 117 స్థానాల్లో 77 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకున్నా ఆశించిన ఫలితాలు మాత్రం దక్కలేదు. ఇక బిజెపికి అంతా విజయపరంపరే. ఉత్తరప్రదేశ్‌లోనైతే బిజెపి ఒక ప్రభంజనమే అయ్యింది. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అన్ని రికార్డులను బద్దలుకొట్టి అక్కడ విజయదుందుభి మోగించింది. యుపిలో మొత్తం 403స్థానాల్లో 312 స్థానాలను బిజెపి స్వయంగా సాధించి తన సత్తా చాటుకుంది. బిజెపి ఒక్కటే ఇక్కడ 312 స్థానాలు సాధించగా, మిత్రపక్షాలతో కలసి మొత్తం 325 స్థానాలను సాధించి యు.పిలో బిజెపి తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది. ఒక్కమాటలో చెప్పాలంటే యుపిలో విజయం..బిజెపి విజయయాత్రలో ఒక సువర్ణాధ్యాయం. ఇది అసాధారణ విజయం. కాంగ్రెస్‌కు మాత్రం ఒక్క పంజాబ్‌లో మినహా మిగిలిన అన్నిచోట్ల నిరాశే ఎదురైంది. అందులోనూ రాహుల్ విస్తృతంగా పర్యటించిన ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ ఘోరపరాజయం చవిచూడడం ఎంత విచారకరమో!.. యు.పిలోనూ కాంగ్రెస్‌కు పరాజయమే. చివరికి అమేథీలో రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కచోట కూడా కాంగ్రెస్ విజయం సాధించలేదు. అంతేకాదు, సోనియాగాంధీ ఎంపిగా వున్న రాయ్‌బరేలీలోని ఆరు నియోజకవర్గాల్లో రెండింటిలో మాత్రమే కాంగ్రెస్ గెలవడం, ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ ప్రచారం చేసిన ఏ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ గెలవలేకపోవడం కాంగ్రెస్ దుస్థితికి నిదర్శనం. సమాజ్‌వాదీ పార్టీతో కాంగ్రెస్ జతకట్టినా, అఖిలేష్- రాహుల్ ఇద్దరూ కలసి ఎంతగా ప్రచారాలు చేసుకున్నా ఫలితం లేకపోయింది. నెహ్రూ కాలం నుంచి రాహుల్ దాకా వారి కుటుంబానికి అండగా నిలచిన రాయ్‌బరేలి, అమేథి నియోజకవర్గాల్లో ప్రజలు కూడా కాంగ్రెస్‌ను ఆదరించకపోవడం కంటే విషాదం ఆ పార్టీకి ఇంకేమి కావాలీ?..

ఇకపోతే, ఉత్తరాఖండ్‌లో 70 సీట్లలో అత్యధికంగా 57 స్థానాల్లో కమలం జెండా రెపరెపలాడింది. ఇక్కడ కాంగ్రెస్ కేవలం 11 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఇతర పార్టీల మద్దతుతో గోవా, మణిపూర్‌లలోనూ బిజెపి హవా సాగుతోంది. గోవాలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్‌కు కంచుకోటగా వున్న మణిపూర్‌లో గత ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా సాధించలేని బిజెపి ఇప్పుడు ఏకంగా అక్కడ 21 స్థానాలు గెలుచుకుంది. గోవా, మణిపూర్‌లలో బిజెపి కాంగ్రెస్‌కంటే తక్కువ స్థానాలే సాధించినా, ఇతర పార్టీల మద్దతు బిజెపికి లభించడంతో ఈ రెండుచోట్లా బిజెపి ప్రభుత్వాలు ఏర్పాటు కానున్నాయి.

ఏదేమైనా ఈ ఎన్నికల్లో బిజెపి పరిస్థితి ఎంతో ఉత్సాహంగా వుండడంతో కమలనాధుల ఆనందానికి అంతే లేదు. ఈ ఘనవిజయాలన్నీ ప్రధానంగా ప్రధాని మోదీ..బిజెపి సారధి అమిత్‌షాల కృషేననడంలో అతిశయోక్తేమీ లేదు. భవిష్యత్తులో మరింతగా ప్రజాదరణ పొందేందుకు..దేశంలో తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు..బిజెపికి ఈ ఎన్నికల ఫలితాలు మంచి ఉత్సాహాన్నిచ్చేవేనని వేరే చెప్పనవసరం లేదు.

# పోలీసు వ్యవస్థను కించపరిస్తే సహించం



పోలీసు వ్యవస్థను కించపరిచేలా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ నాయకులను హెచ్చరించారు. నెల్లూరులోని సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూ అడ్డంగా దొరికిన వైద్యులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారని చెప్పారు. అయితే దాన్ని సమర్థించుకునేందుకు తమపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పొర్లుకట్ట ఘటనపై తమ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ఈ ఘటనలో పోలీసులు అవినీతికి పాల్పడ్డారని వారు ఆరోపించడం దారుణమన్నారు. ఉద్యోగరీత్యా ఏవైనా సమస్యలుంటే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. పోలీసులు అవినీతిపరులని పేర్కొనడం సరైన పద్ధతి కాదని సూచించారు. పోలీసులపై విమర్శలు చేసేటప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలని, ఇప్పటికైనా పోలీసుశాఖపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### విమర్శలు మాని..

# పేదరోగులకు వైద్యసేవలందించండి

నెల్లూరుజిల్లా రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలపై విమర్శలు మాని డాక్టర్లు పేద రోగులకు నిజాయితీగా వైద్యసేవలందించాలని పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరశింహ రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆసుపత్రిని తనిఖీ చేశారు. సర్జికల్, జనరల్ ఓపి విభాగంలో డాక్టర్లు కొంతమంది లేకపోవడాన్ని గుర్తించి సూపరింటెండెంట్ ద్వారా ఫోన్ చేసి పిలిపించారు. దీంతో అక్కడికి వచ్చిన డాక్టర్లు తాము ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నామని, దొంగల్లా చూడొద్దన్నారు. అనంతరం ఆయన పలు వార్డులు తనిఖీ చేశారు. సీనియర్ రెసిడెంట్లు పలువురు ఆస్పత్రిలో లేని విషయాన్ని తెలుసుకుని ఎవరెవరు విధులకు గైర్హాజరవుతున్నారో జాబితాను తయారు చేయాలని, వారి సర్టిఫికెట్లు ఇవ్వొద్దని ప్రిన్సిపల్ రవిప్రభును కోరారు. కమిటి డైరెక్టర్ బి.వి.లక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు, పారిశుద్ధ్య కమిటి నిర్వాహకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# మోదీయే శక్తివంతమైన నేత

భారతదేశ చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన నేతగా మన ప్రధాని నరేంద్రమోడీ అవతరించారు. మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆయన సత్తా చూపారు. ఛాలెంజ్‌గా తీసుకున్న ఉత్తరప్రదేశ్‌లో చారిత్రాత్మక ఫలితాలను సాధించారు. యూపిలో బీజేపీ విజయం మోడీ నాయకత్వం వల్ల వచ్చిందే! స్వాతంత్ర్యానంతరం భారత పరిపాలనలో నెహ్రూ, ఇందిరాగాంధీల తర్వాత మోడీయే శక్తివంతమైన నేత అని కొన్ని మీడియా సంస్థలు వివరిస్తున్నాయి. కాని, వారిద్దరికంటే కూడా మోడీయే శక్తివంతమైన నేత. ఎందుకంటే నెహ్రూ పెద్ద సంపన్న కుటుంబం నుండి వచ్చాడు. స్వాతంత్ర్యం తర్వాత ఆయన ప్రధాని పదవి ఎక్కడానికి మహాత్మాగాంధీ సహకరించాడు. ఇక ఇందిరాగాంధీకి రాజకీయం వారసత్వం ద్వారా సంక్రమించింది. గాంధీ బ్రాండ్ ఆ కుటుంబానికి ఉపయోగపడింది. కానీ, మోడీకి ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేదు. గాంధీజీ వంటి గ్రాండ్ ఫాదర్‌లు, గాడ్ ఫాదర్‌లు లేరు. జీరో నుండి రాజకీయాల్లో ఆయన ప్రస్థానం మొదలైంది. స్వయంకృషితో హీరోలా ఎదిగాడు. ఇంతవరకు స్వతంత్ర భారత చరిత్రలో మోడీని మించిన శక్తివంతమైన నాయకుడు లేడు. ఎందుకంటే పేద కులం నుండి ఎదిగిన నాయకుడు ఆయనొక్కడే!

**సి.రాజీవి, నెల్లూరు.**

# బూటకపు ఆస్తుల ప్రకటన!

నీతి నిజాయితీకి తాము ప్రతిరూపాలు అన్నట్లు చంద్రబాబునాయుడు కుటుంబం అప్పుడప్పుడూ తమ ఆస్తులను ప్రకటిస్తుంటుంది. వారి ఆస్తుల లెక్కలు చూసి ఇన్నేళ్ళు రాజకీయాల్లో వున్న వీళ్ళు సంపాదించింది ఇంతేనా అని తెలుగుతమ్ముళ్ళు బాధపడుతుండేవాళ్ళు కూడా! వీళ్లకు సంపాదించుకోవడం కూడా చేతకావడం లేదని జాలిపడేవాళ్ళు. మొన్న ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా లోకేష్‌బాబు ప్రకటించిన ఆస్తుల వివరాలు చూసి మనం వెర్రి వెంగళప్పలమయ్యామని తెలుగుతమ్ముళ్ళు బాధపడుతున్నారు. ఆరు నెలల క్రితం లోకేష్‌బాబు ప్రకటించిన ఆస్తులు 14కోట్లు. ఇప్పుడేమో ఏకంగా 300కోట్లు. అతనేమో పాలు, పెరుగు, కాయగూరలు అమ్ముకునే ఇన్ని కోట్లు సంపాదించామంటున్నాడు. మరి వాటిని ఉత్పత్తి చేసే రైతులెందుకు లక్షలు, కోట్లు కాదు కదా వేలల్లో కూడా సంపాదించలేకపోతున్నారు.

**వై.వి.బాలకృష్ణప్రసాద్, నెల్లూరు.**

# సామాన్యులపై బాదుడా?

బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలకు వేలకోట్ల అప్పులిచ్చాయి. వారిలో డిఫాల్టర్లే చాలామంది వున్నారు. వారి ఆస్తులన్నీ జప్తు చేసినా గాని బ్యాంకు బకాయిల్లో పావువంతు కూడా జమ కావు. బ్యాంకులు వాళ్ళ వద్ద బకాయిలు వసూలు చేయడం చేతకాక తమ ఖాతాదారులైన సాధారణ ప్రజలను ఛార్జీల రూపంలో బాదాలనుకోవడం విచారకరం. బ్యాంకు లావాదేవీల మీద ఛార్జీల భారం మోపాలనుకోవడం దారుణం. సాధారణ ప్రజలు బ్యాంకుల్లో ఖాతాలను ఉపసంహరించుకుంటే బ్యాంకులన్నీ మూతపడి, లక్షలాది మంది ఉద్యోగులు రోడ్డున పడతారు.

**– బండి కైవల్య, వెంకటగిరి.**

# ఎంతమందికి తెలుసు?

ఇటీవల జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే పట్టభద్రులు చాలామంది వరకు అసలు ఎన్నికలు జరుగుతున్న విషయమే తెలియదన్న సంగతి అర్థమౌతోంది. వారికి ఈ ఎన్నికలపై కాలేజీ దశలోనే అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

**– కృష్ణ, నెల్లూరు.**



## వీరి అత్యుత్సాహమే...

# వారిని అలర్ట్ చేసింది

### • వైసిపిని వెంటాడుతున్న అనుభవరాహిత్యం

**రాజకీయాలలో ఉత్సాహం ఉండాలి... అత్యుత్సాహం కాదు. వ్యూహం వుండాలి... కాని ఆ వ్యూహం ప్రచారంలో వుండకూడదు. దొంగను పట్టుకోవాలంటే పోలీసులు చాటుమాటుగా వెళ్ళాలి... అంతేగాని సైరన్ మోగించుకుంటూ పోతే దొంగలు దొరుకుతారా?**

నెల్లూరుజిల్లా స్థానికసంస్థల శాసన మండలి నియోజకవర్గానికి ఈ రోజు(17వ తేదీ) ఎన్నిక జరిగింది. బ్యాలెట్ బాక్సులో పడ్డ ఓట్లలో ఎవరికెన్ని పడ్డాయో చెప్పలేం గాని పైకి కనపడుతున్న వాతావరణం మాత్రం తెలుగుదేశానికే అనుకూలంగా వుంది. దీనికి ప్రధాన కారణం తెలుగు దేశంపార్టీ అధికారపార్టీ కావడమే!

ఈ ఎన్నికల్లో అభ్యర్థిని ఎంపిక చేసిన నాటి నుండి ఎలక్షన్ వరకు వైకాపా నాయకులు పన్నిన వ్యూహాలన్నీ విఫలమయ్యాయి. ఒకరకంగా చూస్తే ఆ పార్టీ నాయకులు మొదట్లో ప్రదర్శించిన అత్యుత్సాహమే వారి కొంప ముంచిందని కూడా చెప్పవచ్చు.

ప్రజల ఓట్లతో ముడిపడి వుండే లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక ఎన్నికలలో ఎలాంటి ప్రభావాలు, ఎటువంటి ప్రలోభాలు పనిచేయవు. ప్రజలు ఎవరికి నచ్చితే వాళ్ళకు ఓట్లేసుకుంటారు. కాబట్టి ఎవరు అత్యుత్సాహం ప్రదర్శించినా వచ్చే నష్టమేమీ వుండదు. కాని ప్రజాప్రతినిధులే ఓటర్లుగా వుండే స్థానిక శాసనమండలి ఎన్నికల్లో మాత్రం పార్టీలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యంగా ఇలాంటి ఎన్నికల్లో అధికారపార్టీ అవకాశాలను వాడుకుంటుంది. ప్రతిపక్షం చాప క్రింద నీరులా పనిచేయాలి. అధికారపక్షానికి పోబిడి కూడా రాకుండా పక్కా వ్యూహంతో దెబ్బకొట్టాలి.

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా వైకాపా నేతలు అలాంటి వ్యూహం పన్నలేక పోయారు. ఒక ఎలుకను పట్టుకుని వంద జింకలను వేటాడినట్లు ఫోజిచ్చారు. దాంతో ప్రత్యక్షంగా తెలుగు శ్రేణులను అప్రమత్తం చేసి ఆ పార్టీ చాపక్రిందకు పోవాల్సిన నీళ్ళను తమ చాపక్రిందకు తెచ్చుకున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వాకాటి నారాయణరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలు ఖరారు కాగానే ఫిరాయింపులు మొదలయ్యాయి. మొదట వైకాపా వాళ్ళే ఫిరాయింపులకు శ్రీకారం చుట్టారు. ఇందుకూరుపేట, ఉదయగిరిలలో ఆరుగురు ఎంపీటీసీలను చేర్చుకోవడంతో పాటు పత్రికల్లో పెద్దపెద్ద ఫోటోలు వేయించుకున్నారు. తామేదో పెద్ద ఘనకార్యం సాధించినట్లు ఫోజిచ్చారు. దీనికి తోడు 'తెలుగుదేశంకు షాక్' అంటూ హెడ్డింగ్‌లు... వీటిని చూడగానే చంద్రబాబుకు ఎక్కడో కాలింది. వెంటనే మంత్రి నారాయణను మొదలుకొని జిల్లాలోని ప్రతి తెలుగుదేశం నాయకుడికి గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. ఎమ్మెల్సీని గెలిపించకపోతే మీ అంతు చూస్తానంటూ చంద్రబాబు హెచ్చరించారు. వాకాటిని వ్యతిరేకిస్తున్న నాయకులతో కూడా చంద్రబాబు మాట్లాడి వాకాటికి అనుకూలంగా పనిచేయిస్తున్నాడు. చంద్రబాబు ఈ ఎలక్షన్‌ను ప్రిస్టేజీగా తీసుకున్నాడు. తెలుగుదేశం నాయకులను కట్టడి చేసాడు. వైకాపా శిబిరం నుండి ఇంకొంత మందిని లాగేసారు. పోలీసులను కూడా బాగానే వాడుకున్నారు. అధికారపార్టీగా తెలుగుదేశంవాళ్ళు అన్ని అవకాశాలను ఉపయోగించుకున్నారు. వైకాపా వాళ్ళకు రూటు లేకుండా కట్టడి చేశారు.

కాని వైకాపా ఈ ఎన్నికల్లో ఇంకో విధంగా వ్యవహరించి వుండాలి. తమకు మద్దతిస్తున్న ఎవరిని కూడా బయటకు రానీయకూడదు. తమ సంఖ్య తక్కువగానే వున్నట్లు, కేవలం మొక్కుబడిగా పోటీ చేసినట్లు కలరింగ్ ఇచ్చి ఉండాలి. ఓటర్లను క్యాంపులకు పంపించే పరిస్థితి తెచ్చి ఉండకూడదు. తమ పార్టీ నుండి వలస వెళ్ళిన వారితో పాటు ఇంకొంత మంది తెలుగుదేశం సభ్యుల మద్దతు కూడా పొంది ఉండొచ్చు. తాము ఓడిపోతామనే ఫీలింగ్‌తోనే ఎలక్షన్ చేసి వుండాలి. చంద్రబాబు దీనిమీద దృష్టి పెట్టేంత పరిస్థితి తెచ్చి ఉండకూడదు. ఒక్క మాటలో చెప్పాలంటే నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలికి జరిగిన తొలి ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాదిరిగా ఈ ఎన్నికల్లో వైకాపా వాళ్ళు సైలెంట్‌గా వర్క్ చేసుంటే పరిస్థితి ఇంకో విధంగా ఉండేది.

### • ఉద్యోగుల్లో వార్

# రెవెన్యూ Vs డాక్టర్స్

ప్రభుత్వం ఒక చెట్టు అయితే... అందులోని శాఖలు కొమ్మల్లాంటివి. ఒక్కోసారి ఈ కొమ్మల మధ్యే తగవులొస్తుంటాయి. అలాంటి తగవే జిల్లాలో రెవెన్యూ, ప్రభుత్వ వైద్యుల మధ్య వచ్చింది. ఆ మధ్య జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు నగరంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న ఆరుగురు ప్రభుత్వ వైద్యులను పట్టుకుని వారిని సస్పెండ్ చేయడం, కొద్దిరోజుల తర్వాత వైద్యశాఖా మంత్రి ఆ సస్పెండ్‌ను ఎత్తేయడం తెలిసిందే! ప్రభుత్వ వైద్యశాలలో సంతకం పెట్టి, ప్రైవేట్ క్లినిక్‌లలో వైద్యులు పనిచేయడం అన్నది కొత్త సంప్రదాయం కాదు. ఎప్పటినుండో వస్తున్నదే! కాకపోతే జిల్లాకు కలెక్టర్ కొత్త కాబట్టి ఆ సంప్రదాయం గురించి తెలియక, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలను మెరుగుపరచాలని ఆశపడి తొందరపడ్డాడు.

కలెక్టర్ చర్యపై ఇటీవల ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముందు సొంతింటిని చక్కదిద్దుకోండంటూ కలెక్టర్‌కే సవాల్ విసిరారు. వారు చేసిన విమర్శల్లోనూ కొంత అర్థముంది. రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అవినీతిమయమైపోయింది. ఏ తహశీల్దార్, ఆర్ఐ ఏసిబికి పట్టుబడ్డా కోట్లాది రూపాయల ఆస్తులు బయటపడుతున్నాయి. లంచం లేనిదే ఎవరూ పని చేయడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తే మేం 24 గంటలూ పనిచేస్తాం... కాని మీ రెవెన్యూ వ్యవస్థలో అన్ని వసతులు ఉన్నప్పటికీ ఉద్యోగులు ఎన్నిగంటలు పనిచేస్తున్నారని వాళ్ళు ప్రశ్నించారు. మధ్యలో పెన్నా పొర్లుకట్ట బాణాసంచా గోడౌన్ ప్రమాద సంఘటనను ఎత్తి పోలీసులను కూడా కలబెట్టారు. దీంతో పోలీసు అసోసియేషన్ వాళ్ళు కూడా ఈ వార్‌లో ఎంటరయ్యారు.

మొత్తంగా రెవెన్యూ, పోలీసు, ప్రభుత్వ డాక్టర్ల వార్‌లో తెలిసిందేంటంటే ఒకరిలోని లోపాలను ఒకరు బయటపెట్టుకున్నారు. ఏ శాఖ వాళ్ళు కూడా చిత్తశుద్ధితో పనిచేయడం లేదన్నది వాస్తవం. జీతం తీసుకుంటున్న ప్రభుత్వ వైద్యుడు డ్యూటీ ఎగ్గొట్టి ప్రైవేట్ క్లినిక్‌లలో పని చేయడం నేరమే! అదే సమయంలో ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటున్నా కూడా పాసుబుక్కులకు, అడంగళ్ళకు, ఇతరత్రా సర్టిఫికేట్లకు సామాన్య ప్రజల నుండి లంచాలు వసూలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది చేస్తున్నది కూడా నేరమే. ప్రభుత్వ వైద్యులను దారికి తేవాలనుకున్న కలెక్టర్ చర్య అభినందనీయం. అదే సమయంలో రెవెన్యూలో నాటుకుపోయి వున్న లంచాల పీడ నుండి కూడా ప్రజలకు మోక్షం కల్పించాల్సి వుంది.

# మనస్ఫూర్తిగా పని చేశారా?



నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల నుండి తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా నిలబడ్డ వాకాటి నారాయణరెడ్డి కోసం ఆ పార్టీలోని మెజార్టీ నాయకులు మనస్ఫూర్తిగా పని చేయలేదు. కాకపోతే చంద్రబాబు మాటను ధిక్కరించలేక, మనసు చంపుకుని వాకాటి కోసం కష్టపడ్డారు. వాకాటికి సీటివ్వడమే పార్టీలో చాలామందికి ఇష్టం లేదు. ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్న రీతిలో వ్యవహరిస్తున్న ఆయన తీరు పార్టీలో అందరికీ నచ్చదు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశంలోకి వచ్చిన మనిషి. ఏళ్ల తరబడి పార్టీ జెండాలను మోసిన వాళ్ళను కాదని ఆయనను అభ్యర్థిని చేయడమే ఎక్కువమందికి నచ్చలేదు.

ముఖ్యంగా ఆయన సొంత నియోజకవర్గం సూళ్ళూరుపేట నాయకులకే ఆయనంటే పడదు. పార్టీ పెట్టినప్పటి నుండి సూళ్ళూరుపేటలో పార్టీని నడిపిస్తున్న వేనాటి రామచంద్రారెడ్డికి ఆయనంటే అస్సలు పడదు. వాకాటి వచ్చాకే సూళ్ళూరుపేట పార్టీలో (మిగతా 11వ పేజీలో)

# నిలుపుకుంటారా? వదిలేస్తారా?

**నెల్లూరులోని వి.ఆర్. విద్యాసంస్థల కమిటీని రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇస్తుందని ఎవరూ ఊహించలేదు. అసలు దీనిపై విచారణ జరుగుతుందని కూడా చాలామందికి తెలియదు. ఉన్నట్లుండి వచ్చిన తీర్పును చూసి ఆనం వర్గీయులు కూడా చాలామంది షాక్‌కు గురయ్యారు.**

విఆర్ విద్యాసంస్థల భవిష్యత్ ఇక ముందు ఏ విధంగా ఉండబోతుంది? హైకోర్టు తీర్పుతో ప్రస్తుతమున్న కమిటీని రద్దు చేయాలి. వి.ఆర్. విద్యాసంస్థలను దేవాదాయ శాఖకు అప్పగించాలి. ఈ విద్యాసంస్థల పర్యవేక్షణను ప్రత్యేకాధికారికి అప్పగించాలి. ఇదంతా ప్రభుత్వం చేయాలి. మరి ప్రభుత్వం దానికి సిద్ధంగా ఉందా? లేక ఆనం సోదరులు తమ పార్టీలో ఉన్నారు కాబట్టి తమ శరణుకోరారు కాబట్టి ఏదో ఒక రూపంలో ఈ విద్యాసంస్థలపై వారి పెత్తనాన్నే అనుమతించబోతుందా? అన్నది ప్రశ్న! విఆర్ విద్యాసంస్థలతో వున్న అనుబంధాన్ని ఆనం సోదరులు అంత సులభంగా తెంచుకోలేరు. హైకోర్టు తీర్పు వచ్చాక, ఈ సంస్థలపై తమ పట్టును నిలుపుకోవడానికి వారి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇందులో చంద్రబాబు విశ్వాసపాత్రుడు మంత్రి నారాయణ సహకారం ఆశిస్తున్నారు.

అయితే హైకోర్టులో ఆనం సోదరులకు వ్యతిరేకంగా పోరాడింది బీజేపీ అనుబంధ సంస్థ అయిన ఏబివిపి పూర్వవిద్యార్థులు. తెలుగుదేశంకు బీజేపీ మిత్రపక్షం. ఇక్కడ బీజేపీ అంటే వెంకయ్యనాయుడిదే కీలకపాత్ర! ఆనం సోదరులకు ఆయనతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. కాబట్టి ఈ విషయంలో చంద్రబాబు ఆనం సోదరులకు ఏదన్నా సాయం చేయాలనుకుంటే అందుకు వెంకయ్య అభ్యంతరం పెడతాడా? లేదా అన్నది అనుమానం. ఒకవేళ వెంకయ్యనాయుడు లేదా స్థానిక బీజేపీ నాయకులు విఆర్ విద్యాసంస్థలపై ఆనం సోదరుల పెత్తనాన్ని కొనసాగించే ఎలాంటి చర్యలకైనా మద్దతు పలికితే ఇక ఏబివిపి పూర్వవిద్యార్థులు చేసిన 24ఏళ్ల సుదీర్ఘ పోరాటం బూడిదలో పోసిన పన్నీరే!

### బాబు కోర్టులో విఆర్‌సి బంతి






అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

### విఆర్ విద్యాసంస్థలను
## స్వాధీనం చేసుకోవాలి

నెల్లూరుజిల్లాకు ఎంతో ప్రతిష్టాత్మకమైన విఆర్ విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని, అవి అన్యాక్రాంతం కాకుండా తక్షణమే ప్రత్యేకాధికారి పాలనను తీసుకురావాలని ఏబివిపి డిమాండ్ చేసింది. ఏబివిపి పూర్వవిద్యార్థి ఆమంచర్ల శంకరనారాయణ 24ఏళ్ళ సుధీర్ఘ పోరాటం తర్వాత 1993లో ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన కమిటికి చట్టబద్ధత లేదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఏబివిపి విజయమని సంఘ నాయకులు గంగాధర్, కౌషిక్ అన్నారు. ఇటీవల నెల్లూరులోని ఏబివిపి కార్యాలయంలో విఆర్ విద్యాసంస్థల వ్యవహారంపై గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఆనం వివేకానందరెడ్డి ఛైర్మెన్‌గా, రామనారాయణరెడ్డి అధ్యక్షుడిగా వున్న కమిటికి ఎలాంటి హక్కులు లేవని, ఈ నేపథ్యంలో విఆర్ విద్యాసంస్థల ఆస్తులను పరిరక్షించేందుకు ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయకపోతే కళాశాల నిధులు దుర్వినియోగమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటి కార్యదర్శి దారా వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి నరేష్, బాబు, రాజేష్, బాలచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

### ప్రత్యేక అధికారిని నియమించాలి

హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా విఆర్ విద్యాసంస్థలను స్వాధీనం చేసుకుని ప్రత్యేక అధికారిని నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి నందకిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్‌ఓ కృష్ణభారతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్ విద్యాసంస్థలకు సంబంధించి ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రిన్సిపల్‌తో దొంగబిల్లులపై సంతకాలు చేయించి లక్షల్లో డబ్బులు గుంజుకుంటున్నారని ఆరోపించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు షారూఖ్, సనత్, సాయి, వెంకయ్య పాల్గొన్నారు.

### సివిల్ సప్లయిస్
## డిఎంగా కృష్ణారెడ్డి

జిల్లా పౌరసరఫరాల శాఖ డి.ఎంగా కృష్ణారెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన కర్నూలు జిల్లాలో ఏఎం టెక్నికల్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ డిఎంగా వున్న కొండయ్యను ఏలూరు డిఎంగా బదిలీ చేశారు.

### రంగనాథుని సేవలో
## జయశంకరకృష్ణ

మాజీముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ కుమారుడు జయశంకర కృష్ణ ఆదివారం నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని, మూలాపేటలోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని విశేషపూజలు నిర్వహించారు. రంగనాథస్వామి, ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మెన్లు మంచి కంటి సుధాకరరావు, మెట్టు సురేష్‌బాబు ఆహ్వానం మేరకు ఆయన నెల్లూరొచ్చారు.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరులోనే వైసిపి ఎమ్మెల్యేలు

ఈ నెల 17న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వైకాపా ఎమ్మెల్యేలు ఆరుగురు కూడా జిల్లాలోనే ఉండిపోవాల్సి వచ్చింది. పార్టీ అధినేత జగన్ వారికి ఆ మేరకు ఆదేశాలిచ్చారు కూడా! బడ్జెట్ సమావేశాలైనప్పటికి ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఉండడంతో ఎమ్మెల్యేలను జిల్లాలో వుండి ఎన్నికలను పర్యవేక్షించాలని జగన్ కోరారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం తనకు సంబంధించిన ప్రశ్న ఒకటి 15వ తేదీ సభలోకి రావడంతో ఆయన ఆరోజు ఉదయాన్నే సమావేశానికి హాజరై వెంటనే నెల్లూరొచ్చేసారు.

## పదవతరగతి పరీక్షలు ప్రారంభం

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. జిల్లా వ్యాప్తంగా 173 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 170 రెగ్యులర్ విద్యార్థులకు, మూడు సెంటర్లు మాత్రం ఫెయిల్ అయ్యి మళ్ళీ రాస్తున్న విద్యార్థులకు కేటాయించారు. జిల్లాలో మొత్తం 34వేల 381మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో రెగ్యులర్ 33వేల 798 మంది, ఫెయిల్ అయి మళ్ళీ రాస్తున్న విద్యార్థులు 583మంది ఉన్నారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరగనున్నాయి. సిసిఇ విధానంలో తొలిసారిగా ప్రశ్నాపత్రాన్ని చదువుకునేందుకు 15నిమిషాలు అదనంగా కేటాయించారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 500మంది సిబ్బందిని నియమించారు.
*సిసి కెమెరాల ఏర్పాటు:* నెల్లూరుజిల్లాలోని కలువాయి ఏ, బి సెంటర్లు, పొదలకూరులోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కోటలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సి.సి. కెమెరాలను బిగించారు.

## పోలీసులకు ఆరోగ్యపరీక్షలు



రాష్ట్ర డిజిపి సాంబశివరావు ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారి మొదలు కానిస్టేబుల్ వరకు అందరికి కాల్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ తెలిపారు. సోమవారం నెల్లూరు మూలాపేటలోని పోలీసు హాస్పిటల్ ఆవరణంలో ఏర్పాటుచేసిన ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఎస్పీ విశాల్‌గున్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్ళకు లోనై పోలీసు అధికారుల నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. విధి నిర్వహణ కాదు ఆరోగ్యం ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకుని విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎవరెవరు ఏరోజు వచ్చి పరీక్షలు చేయించుకోవాలో ముందుగా తెలియజేస్తారన్నారు. అదనపు ఎస్పీ బి.శరత్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ వీరభద్రుడు, రూరల్ డిఎస్పీ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, ఏఆర్, హోంగార్డ్ ఆర్‌ఐలు కె.శ్రీనివాసరావు, కెజెఎం చిరంజీవి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఆర్‌ఎస్‌ఐలు రమణారెడ్డి, గోపినాథ్, పోలీసు అధికారుల సంఘం నాయకులు తురకా శ్రీనివాసులు, పెంచల ప్రసాద్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ సర్జరీలపై వాకర్స్‌కు అవగాహన



నెల్లూరు ఏ.సి. సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్, కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ ఏ.వి.రెడ్డి ప్లాస్టిక్ సర్జరీలపై అవగాహన కల్పించారు. గ్రహణమొర్రి, వేళ్ళు అతుక్కుని ఉండడం, కాలిన గాయాలు, రహదారి ప్రమాద ఘటనలకు సంబంధించి ప్లాస్టిక్ సర్జరీలు చేయవచ్చన్నారు. త్వరలో నెల్లూరులో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలను చేయనున్నట్లు వివరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, నలుబోలు బలరామయ్య నాయుడు, ఎస్.రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## వెక్కిరిస్తున్న ఏటిఎంలు




పెద్దనోట్ల రద్దు తర్వాత కరెన్సీ కొరత తీరినట్లే తీరి మళ్ళీ మొదటికొచ్చింది. ఏటిఎంల ముందు 'నో క్యాష్' అని వ్రాసున్న బోర్డులు యధాఫలంగా వేలాడుతున్నాయి. బ్యాంకుల్లో నగదు విత్‌డ్రాపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో కరెన్సీ కష్టాలు తిరిగి మొదలైనట్లుంది. పెద్దనోట్ల రద్దు తర్వాత 2016 నవంబర్ నుండి 2017 జనవరి దాకా జనం నగదు కోసం కటకటలాడారు. ఫిబ్రవరిలో నగదు పరిమితిపై ఆంక్షలు ఎత్తేయడంతో నగదు లావాదేవీలు తిరిగి ట్రాక్ ఎక్కినట్లే కనిపించింది. అయితే బ్యాంకుల్లో నగదు లావాదేవీలపై అధిక ఛార్జీలు బాదేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకుల నుండి డబ్బులు తెచ్చుకున్నవాళ్ళు మళ్ళీ బ్యాంకుల్లో జమచేయడం లేదు. మా డబ్బుకు కూడా మేం టాక్స్‌లు కట్టడం ఏంటనే ఫీలింగ్‌తో ఉన్నారు. అదీగాక నోట్ల రద్దప్పుడు తమ వద్ద వున్న నగదునంతా బ్యాంకుల్లో జమ చేసినవాళ్ళు తిరిగి కొత్త కరెన్సీని విడతల వారీగా బ్యాంకుల నుండి తెచ్చేసుకున్నారు. ఈ డబ్బు తిరిగి బ్యాంకులకు పోకపోతుండడం, ప్రభుత్వం ఆశిస్తున్నంతగా డిజిటల్ కరెన్సీ లావాదేవీలు పెరగకపోతుండడంతో నగదు కష్టాలు తొలగడం లేదు.

### తూచ్...
## విమర్శలతో సంబంధం లేదు

జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీసు వ్యవస్థలపై ప్రభుత్వ వైద్యులు చేసిన విమర్శలతో మాకెలాంటి సంబంధం లేదని జిల్లా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పి.భక్తవత్సలం, సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.ఎల్.సుస్మితలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యుల న్యాయబద్ధమైన టైంబౌండ్ ఉద్యోగోన్నతులు, జీతాలకు సంబంధించిన అంశాలకు మాత్రమే మద్దతు తెలపడానికి ఐఎంఏ సీనియర్ నాయకులు డాక్టర్ అశోక్ 10వ తేదీ పెద్దాసుపత్రి వద్ద జరిగిన ధర్నాకు వెళ్ళారన్నారు. రెవెన్యూ, పోలీసులపై డాక్టర్లు చేసిన విమర్శలకు తమకు సంబంధం లేదన్నారు.

## ఫస్టియర్ పిల్లలకు హ్యాపీడేస్



ఈనెల 13వ తేదీతో ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు ముగిసాయి. పరీక్షలు ముగిసిన ఆనందంతో విద్యార్థులు తమ వద్ద వున్న పుస్తకాలను ముక్కలు ముక్కలుగా చింపి నెల్లూరు రోడ్లను చెత్తమయం చేసారు. ఓ పక్క ప్రధాని నరేంద్రమోడీ స్వచ్ఛభారత్ అంటూ మొత్తుకుంటున్నా, మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' అంటూ బిల్డప్ ఇస్తున్నా, ఆ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను అమలులో చూపాల్సిన మంత్రిత్వశాఖ పి.నారాయణ వద్దే వున్నా 'స్వచ్ఛ' అన్నది మాత్రం ఆచరణలో లేకుండా పోతోంది. రాష్ట్రంలో సగం జూనియర్ కాలేజీలు నారాయణవి, ఆయన పార్టనర్ చైతన్య గ్రూప్‌వే! వీళ్ళు కాలేజీల్లో పిల్లలకు కేవలం చదువు మాత్రమే చెబుతున్నారు. కొంచెం సంస్కారం కూడా నేర్పిస్తే సమాజం పట్ల, స్వచ్ఛభారత్ పట్ల కొంత బాధ్యతగా వ్యవహరిస్తారు. ఏడాది పొడవునా పుస్తకాలు పట్టించి చదువులను బట్టీ పట్టిస్తారు. ఏడాదిపాటు చదివిన పుస్తకాలను చించి రోడ్లమీద పారేయొద్దని ఒక్క నిముషం విద్యార్థులకు చెప్పలేరా? ఒక్క నిముషం చదువు తగ్గితే ఒక్క మార్కు తగ్గుద్దేమో... విద్యార్థులపై ఈ చెత్త రిమార్క్ ఉండదుగా!

## పది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి



స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు మూలాపేట నగరపాలక పాఠశాల(రామయ్య బడి)లో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, 21వ డివిజన్ కార్పొరేటర్ నూనె మల్లిఖార్జునయాదవ్, తెలుగుదేశంపార్టీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఊరందూరు సురేంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ ఫౌండేషన్ నిర్వాహకులు కిరణ్, కిషోర్ మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, చదువుకున్న స్కూలును మరచిపోకుండా భవిష్యత్తులో స్కూలు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు భీమారావు, సన్నికుమార్, కిషోర్, సుధీర్, జాన్, శరత్, వెంకటేష్, వెంక్రటావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయ వివాదాలకు...

# ముగింపా? కొనసాగింపా?




**రాజకీయ చైతన్యానికి పురిటిగడ్డ నెల్లూరుజిల్లా! ఇక్కడ పార్టీల మధ్యే కాదు, కుటుంబాల మధ్య, వ్యక్తుల మధ్య కూడా రాజకీయాలు నడుస్తుంటాయి. ఇక సంస్థలు కూడా ఇందుకు అతీతం కాదు. ఏ ముహూర్తాన మొదలుపెట్టారో గాని నెల్లూరులో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని మొదలుపెట్టినప్పటి నుండి అది రాజకీయాలకు కేంద్రబిందువుగానే వుంది. ఈ యూనివర్శిటీలో ఉన్నన్ని రాజకీయాలు కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలలో కూడా లేవు.**

ఈ యూనివర్శిటీలో సాగుతున్న అవినీతి, అక్రమాలపై ఎంతో కాలంగా విద్యార్థి సంఘాలు ఉద్యమిస్తూనే వున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత వి.సి వీరయ్యను రిమోట్ కంట్రోల్‌తో ఆడిస్తూ రిజిస్ట్రార్ శివశంకర్ అంతా తానే అయ్యి నడిపిస్తున్నాడు. ఈయన నేతృత్వంలో గత కొంత కాలంగా యూనివర్శిటీలో అన్నీ వివాదాలే చెలరేగుతున్నాయి. అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించి, కొత్తగా తన చిత్తూరు జిల్లాకు చెందినవారికి ఎక్కువ మందికి ఉద్యోగాలివ్వడం, డిగ్రీ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, హాస్టళ్ళ మూసివేత, భవనాల నిర్మాణం కాంట్రాక్ట్‌లలో అవకతవకలు, మూల నిధి నుండి నిధుల చెల్లింపు. తమకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం... ఇవన్నీ కూడా యూనివర్శిటీలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ యూనివర్శిటీలో జరుగుతున్న అక్రమాల గురించి విద్యార్థి సంఘాలలో ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులు వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. యూనివర్శిటీ వివాదాలు ముదిరి పాకానపడుతున్న తరుణంలో ఇటీవల చదువుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు నెల్లూరు రావడం, యూనివర్శిటీ వివాదాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. యూనివర్శిటీలో అవినీతి, అక్రమాలు, విలువలకు కేంద్ర బిందువైన రిజిస్ట్రార్ శివశంకర్‌పై ఆయన కారాలు మిరియాలు నూరివెళ్లారు. గతంలోనే ఆయన పదవీకాలం ముగిసినా పైస్థాయిలో పైరవీలు జరిపి ఏడాది పాటు తన పదవిని పొడిగించుకున్నాడు. ఈ పొడిగించుకున్న కాలం కూడా మొన్న 14వతేదీతో అయిపోయింది. ఇప్పుడు యూనివర్శిటీలో దండిగా పనులు జరుగుతున్నాయి. మేత కూడా బాగా దొరుకుతుంది. ఈ టైంలో పదవిని వదిలి పోవడం ఆయనకు ఇష్టం లేదు. అందుకనే ఇంకొంత కాలం తన పదవిని పొడిగించుకునేందుకు పైరవీలు చేసినా, ఆ ప్రయత్నాలు ఫలించలేదని తెలుస్తోంది. రిజిస్ట్రార్‌గా కొత్తవారొస్తున్నట్లు సమాచారం. రిజిస్ట్రార్ మారితేనన్నానన్నా వివాదాలు ముగుస్తాయేమో చూడాలి.

## నీ ఆస్తులన్నీ

# సక్రమమేనా?

**- సోమిరెడ్డికి కాకాణి సవాల్**




ప్లేస్ నువ్వు చెప్పినా సరే... నన్ను చెప్పమన్నా సరే... టైం నువ్వు చెప్పినా సరే... నన్ను చెప్పమన్నా సరే... నీ ఇష్టం వచ్చిన దేవాలయాన్ని ఎంచుకో... నువ్వు పూజించే దేవుడి మీద ప్రమాణం చేసి నాకున్న ఆస్తులన్నీ సక్రమమేనని చెప్పుకోగలవా, ఓ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అంటూ వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరాడు. 13వ తేదీ నెల్లూరులోని జిల్లా వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి దేవుని ముందు తన ఆస్తులన్నీ సక్రమమైనవేనని చెబితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. నీ ఆస్తులు సక్రమమైనవని నిరూపించుకోలేకపోతే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తావా అని సోమిరెడ్డికి సవాల్ విసిరారు. సోమిరెడ్డి కుటుంబసభ్యులకు మొత్తం 13పవర్‌ప్లాంట్లలో పెట్టుబడులున్నాయని, బినామీ పెట్టుబడులు పెట్టారు కనుకే వారిని డైరెక్టర్లుగా పెట్టారని ఆరోపించారు. సోమిరెడ్డి బినామీ పెట్టుబడులపై సక్రమంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ నాయకులు మెట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటాచలం జడ్పీటీసీలు వెంకటశేషయ్య పాల్గొన్నారు.

# రాక్షసపాలనకు స్వస్తి పలుకుతాం

**ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డి**




రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక రాక్షస పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందని ఒంగోలు ఎంపి, నెల్లూరుజిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి వై.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని వైయస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు నగర, రూరల్, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు అనిల్ కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ పి.శిరిషా, నెల్లూరు కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్సీపీ ఆవిర్భవించి ఆరేళ్ళు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. దేశచరిత్రలోనే వైయస్సార్సీపీకి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. పార్టీ పెట్టిన కొద్దినెలలకే జరిగిన ఎన్నికల్లో 67మంది ఎమ్మెల్యేలను సాధించిన ఘనత దక్కిందన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన కొత్తల్లో జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో ఉపఎన్నికలు జరిగాయని, అప్పట్లో నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకుంటున్నారన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలతోనే అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో జరుగనున్న స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైయస్సార్సీపీ తరపున గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మపరిశీలన చేసుకుని ఓటెయ్యాలని సూచించారు. దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి ఆశయసాధన కోసం వైయస్సార్సీపీని స్థాపించి మన నాయకుడిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఉండటం ఖచ్చితంగా మనకు వరంగా భావించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి పేర్కొన్నారు. కాగా జిల్లాలోని పలు మండలాల్లో స్థానిక నాయకులు వైయస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

# వేడుకగా గౌరపూర్ణిమ



నెల్లూరు, ఇస్కాన్ మందిరంలో ఈ నెల 12వ తేది రాత్రి గౌరపూర్ణిమ వేడుకలు మందిరం ఛైర్మెన్ డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామి వారిని శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శుకదేవస్వామి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ, పూర్వకాలంలో శ్రీకృష్ణ పరమాత్మ గౌరంగ మహాప్రభువుగా అవతరించి, దుష్టశిక్షణ చేసి శిష్టరక్షణ గావించారని, అందుకు ప్రతీకగా గౌరపూర్ణిమను నిర్వహిస్తున్నామన్నారు. అందరూ సాత్విక జీవనం సాగించాలని, భగవద్భక్తితోనే జీవితాలను సార్థకం చేసుకోవాలని అన్నారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మందిరం వారు భక్తులకు ప్రసాదవితరణ గావించారు.

# ఆత్మగౌరవంలో మనమే ముందున్నాం

**- కలెక్టర్ ఆనందం**




ఆత్మగౌరవం కార్యక్రమం అమలులో నెల్లూరుజిల్లా మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. 13వ తేదీ నెల్లూరులోని తన బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన దీని గురించి వివరించారు. గత కలెక్టర్ ఎం.జానకి ఓడిఎఫ్‌కు ఆత్మగౌరవంగా పేరు పెట్టారు. ఆ కార్యక్రమాన్ని మనం చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. ఈ ఉగాదికి జిల్లా మొత్తాన్ని బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా ప్రకటించబోతున్నాం. 2,96,503 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 2,47,627 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యాయి. 42,088 మరుగుదొడ్ల నిర్మాణం వివిధ దశల్లో వుంది. ఇక 6,838 మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే చేపట్టాల్సి వుంది. ఇప్పటివరకు జిల్లాలో 27 మండలాలను బహిరంగ మలవిసర్జన రహిత మండలాలుగా ప్రకటించాము. ఈ 6,838 మరుగుదొడ్లను మొదలుపెట్టి పూర్తి చేస్తే మిగిలిన 19మండలాలను కూడా ఓడిఎఫ్‌గా ప్రకటించవచ్చు. అప్పుడు జిల్లా నూరుశాతం ఓడిఎఫ్ అవుతుంది. ఉగాది నాటికి ఈ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అన్నారు. కలెక్టర్‌గా తాను బాధ్యతలు చేపట్టాక 2లక్షల 50వేల మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయించానన్నారు. ఓడిఎఫ్ మరుగుదొడ్లకు సంబంధించి 40కోట్ల రూపాయల బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు.

నెల్లూరు పెద్దాసుపత్రి డాక్టర్ల వివాదంపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటూ విధులు ఎగ్గొట్టి ప్రైవేట్ క్లినిక్‌లలో పనిచేస్తున్న డాక్టర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, వారి గురించి పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. పనివేళల్లో వైద్యులు ఖచ్చితంగా వైద్యశాలల్లో వుండాలన్నారు.



## దళిత, గిరిజన ఆలయాల్లో

# వసతులు కల్పించాలి



హిందువులైన దళిత, గిరిజన వాడల్లోని దేవాలయాల్లో ధూపదీప నైవేద్యంకు రూ. 6వేలు, దేవాలయాల్లో పూజలు చేస్తున్న పూజారికి రూ. 6వేలు మంజూరు చేయాలని కోరుతూ శ్రీ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానముల పరిరక్షణ సేవాసమితి సభ్యులు ఈ నెల 10వ తేదీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్రకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ సిఎం చంద్రబాబుకు తక్షణమే ఈ సమస్యలను తెలియపరచి అమలయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు ఆరుముళ్ళ మురళి, కమిటి ప్రతినిధులు మంగళపూరి వెంకయ్య, గిద్దలూరు శీనయ్య, మేకల ఏడుకొండలు, టిడిపి నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగి కృష్ణ పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అధమం..

# అవినీతిలో ప్రథమం

### - విఎస్‌యు తీరుపై వైఎస్సార్ విద్యార్థుల విమర్శ



నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ అభివృద్ధికి ఆమడ దూరంలో వుందని, అవినీతిలో మాత్రం ప్రథమ స్థానంలో వుందని, ఈ యూనివర్సిటీ స్థాపించి ఏడేళ్ళవుతున్నా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోకపోవడం విచారకరమని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు జయవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంగళవారం వారు స్థానిక వైఎస్సార్సీపి రూరల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, యూనివర్సిటీ భ్రష్టుపట్టడానికి ఇన్‌ఛార్జి రిజిస్ట్రారే కారణమని ఆరోపించారు. యూనివర్సిటీని కొత్త భవనంలోకి మార్చి తరగతులను అక్కడే నిర్వహించాలన్నారు. ఆ మేరకు ఇటీవల మంత్రి గంటా శ్రీనివాసరావు వర్సిటీని సందర్శించిన సందర్భంలో భవన నిర్మాణం పట్ల అసహనం వ్యక్తం చేశారని వారు గుర్తుచేశారు. దీనిపై త్రిసభ్య కమిటీ వేయనున్నట్లు హామీ కూడా ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ విద్యార్థి నగర విభాగం అధ్యక్షుడు శేషగౌడ్, రూరల్ అధ్యక్షుడు మధు, నగర ప్రధాన కార్యదర్శి రాకేష్, కార్యదర్శులు పవన్, నిఖిల్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకు పురస్కారం



కర్నూలుజిల్లా పలుకూరు జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేది ఆదివారం కర్నూలుజిల్లా డోన్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కవితా మార్తాండ బిరుదాంకితుడు డా॥ ఎ.సంజీవరాయుడు రచించిన కవితా సంపుటి పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లాకు చెందిన యువరచయిత కె.మురళీమోహన్‌రాజుకు గత 10ఏళ్ళుగా చేస్తున్న సామాజిక సేవను గుర్తిస్తూ, సాహిత్య సేవకు, కళాసేవకు ఆయన చేసిన కృషిని అభినందిస్తూ పద్మశ్రీ ఆచార్య డా॥ కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా 2017 రాష్ట్ర స్థాయి సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందాచారి, డా॥ ఎ.సంజీవరాయుడు, డోన్ మండల విద్యాశాఖాధికారి జె.రామచంద్రుడు, అరసం అధ్యక్షుడు మండ్ల జయరాం తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# దాతల సేవలు అభినందనీయం




వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేస్తున్న హరిచంద్రారెడ్డి

నిస్సహాయక స్థితిలో ఉన్న వృద్ధులకు సాయం చేయడం అభినందనీయమని కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి హరిచంద్రారెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో ఇటీవల రోటరీ హెల్పేజ్ కింద నిరాశ్రయులకు, వృద్ధులకు ఫలసరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవిత చరమాంక దశలో వున్న వృద్ధులను ఆదుకోవడం సంతోషకరమన్నారు. రోటరీక్లబ్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కె.మునిగిరీష్, అధ్యక్షుడు నాగసూరి గోపాలరావు, కె.జానకిరామిరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శవంతురాలు సావిత్రీబాయి

—డిఎస్పీ శ్రీనివాస్



గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అరవ పార్వతయ్య తదితరులు

మహోన్నతమైన సేవలు అందించిన సావిత్రిబాయి పూలేను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ అన్నారు. కోటలోని బాలసదన్‌లో ఇటీవల సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా అరవ వెంకటమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ దాతల దాతృత్వంతో 45మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందించారు. ఏఆర్‌డిపీడీ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పోలమ్మ, సంపూర్ణమ్మ, విజయలక్ష్మి, విజయమ్మ, ప్రమీలమ్మలను సన్మానించారు. అరవ వెంకటమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అరవ పార్వతయ్య ఏఆర్ డిపిడి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి సుందరం, అధ్యక్షుడు కోటయ్య, మండల ఇన్‌ఛార్జి విద్యాశాఖాధికారి నసీమ్‌ఆలీ, వాకాడు సిఐ ఉప్పాల సత్యనారాయణ, కోట ఎస్ఐ అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది పెల్లేటి గోపాలరెడ్డి, బాలసదన్ పర్యవేక్షకురాలు అరుణమ్మ, ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గెలుపుకోసం మభ్యపెట్టడం దారుణం



మాట్లాడుతున్న పిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

శాసనమండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొన్ని సంఘాలు ఓటర్లను మభ్య పెట్టడం దారుణమని పంచాయితీరాజ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని ఎన్‌జివోహోంలో ఇటీవల విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల చేత కూడా ఓట్లు పోల్ చేయించుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇది మేధావుల మేధాతనానికి నిదర్శనమని అన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తరఫున కృషి చేసిన పిఆర్‌టియూ నాయకులు, కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియూ రాష్ట్ర కౌన్సిలర్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గూడూరు మండలం ప్రధానకార్యదర్శి రవిచంద్ర, చిల్లకూరు, కోట, సైదాపురం, మనుబోలు మండలాల పిఆర్‌టియూ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలిండియా బ్రాహ్మణ ఫ్రంట్ కేంద్ర కమిటీ సభ్యుడిగా

# యరగుడిపాటి




యామిజాల రామ్‌జీతో చర్చిస్తున్న యరగుడిపాటి చలపతిరావు తదితరులు

ఇటీవల హైదరాబాద్‌లో న్యూ మారుతీనగర్‌లో శ్రీరామ భక్త సమాజంలో జరిగిన కార్యక్రమంలో గూడూరు ప్రముఖ సీనియర్ న్యాయవాది, గూడూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతి రావును ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫ్రంట్ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పై కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ పార్టీ ప్రతినిధిగా న్యూఢిల్లీలో వ్యవహరిస్తున్న మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి విచ్చేసి ఆయనను అభినందించారు. ఆలిండియా బ్రాహ్మణ ఫ్రంట్ అధ్యక్షుడు యామిజాల రామ్‌జీ, కులకర్ణి, గూడూరు బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివ కుమార్, నాథ్రబ్రహ్మం, కార్యదర్శి శ్రీనివాస రావు, ట్రెజరర్ లలితమ్మ, కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

## కనులపండువగా

# అళఘనాథస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి కళ్యాణోత్సవం

గూడూరు పట్టణంలోని అళఘనాథ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత అళఘనాథస్వామి గరుడ వాహనంపై ఆదివారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి వీధుల్లో ఊరేగించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ భజన బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు ఉభయకర్తలుగా సిఆర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా కనుమూరి హరిచంద్రారెడ్డి వ్యవహరించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం జరిగింది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 17.3.2017 నుండి
తేది. 23.3.2017 వరకు

ఈ వారం మేషంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో వక్రగురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, మీనంలో రవి, బుధ, శుక్రులు, వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 20 శుక్రమౌఢ్యమి ప్రారంభము

**ఫాల్గుణమాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | పంచమి | రా॥ గం.1.34వ॥ |
| తేది. 18 | శని | షష్ఠి | రా॥ గం.3.41వ॥ |
| తేది. 19 | ఆది | సప్తమి | రా॥ గం.5.49వ॥ |
| తేది. 20 | సోమ | అష్టమి | పూర్తిగ |
| తేది. 21 | మంగళ | అష్టమి | ఉ॥ గం.7.39వ॥ |
| తేది. 22 | బుధ | నవమి | ఉ॥ గం.9.13వ॥ |
| తేది. 23 | గురు | దశమి | ఉ॥ గం.10.21వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ప్రలోభాలకు లొంగకుండా ఉద్యోగులు పని చేయాలి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. కొన్ని ముఖ్య విషయాలు ఎవరితోను అనవద్దు. అనుకోని ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఆర్ధిక వ్యవహారాల నిర్వహణలో జాగ్రత్త పడండి. వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా సాగుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు కార్యసామర్ధ్యంతో పాటు, పనివత్తిడి వుంటుంది. విలువైన వస్తువులను పదిలపరచుకొనండి. పెట్టుబడులకు కొత్త అవకాశాలుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ఒక ముఖ్య కార్యం మీద శ్రద్ధ చూపుతారు. కోర్టు వ్యవహారములందు అనుకూలత కలదు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాప్తి బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

విలువైన వస్తువులు సమకూరడం, దూరప్రయాణాలుంటాయి. బిడ్డల వివాహ విద్యా విషయములపై శ్రద్ధ పెడతారు. అధికారులకు మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. ఆరోగ్యం, విద్యా ప్రగతి బాగుంటుంది. ఆర్ధిక ఇబ్బందుల, వ్యవహారంలో ఇబ్బందులు సర్దుకుంటాయి. వృత్తి వ్యాపారాలు విస్తృతి మరియు ఆదాయ వృద్ధి కలదు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఒక మంచి పనికి సంసిద్ధులై కృషి చేస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. క్రొత్త ఆర్ధికావకాశాలు త్వరలో లభించగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. వ్యవహారాలలో తొందరపాటు ప్రదర్శించకండి. ఇబ్బందికరమగు పరిస్థితులు క్రమంగా చక్కబడగలవు. శుభవార్తలు వింటారు. ఉద్యోగప్రయత్నాలు అనుకూలిస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వస్తు, వాహన, ఇంటి రిపేర్లు ఖర్చులు అదనం. విద్యాప్రగతి బాగుంటుంది. అనుకున్న పనులు టెన్షన్‌తో సాగుతాయి. నష్టాలను అటంకాలను ధైర్యంగా ఎదుర్కొంటారు. సభలు సమావేశాలలో మీదే కీలకపాత్ర వుంటుంది. ముఖ్య నోటీసులు అందుకుంటారు. పనులందు టెన్షన్ ఎక్కువగా వుంటుంది. ఆర్ధిక పరిస్థితి క్రమంగా బాగుంటుంది. ఖర్చులు అదుపుచేయాలి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం. కోర్టుకేసులు వాయిదా పడడం, బంధు ముఖ్యులలో ఒకరికి అనారోగ్య బాధలుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు తమ అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. చేయదలచిన పనులందు ఆర్ధిక వ్యవహారాలందు పొరపాట్లు రాకుండా చూచుకొనాలి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బిడ్డల విద్యా ఉద్యోగ శుభకార్యాల విషయాలు ఆందోళన కలిగిస్తాయి. అనుకున్న పనులు జరుపుకొనడానికి శ్రమపడాల్సి వుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదాపతాయి. ఉద్యోగులు ప్రలోభాలకు లొంగవద్దు. ఆరోగ్యం జాగ్రత్త, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అనుకోని ఖర్చులుంటాయి. ఇంట్లో అనారోగ్య బాధితులుంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. దూరప్రయాణాలుంటాయి. సన్నిహితులే ఇబ్బందులు పెట్టే అవకాశం కలదు. కొత్త వస్తువులు ఇంటికి సమకూరతాయి. విద్యా ప్రగతి, ఆరోగ్యం బాగుంటుంది. ఆత్మీయులకు సహాయ పడతారు. బంధుత్వ స్నేహాలు బలపడతాయి. వ్యాపార విస్తరణకు పెట్టుబడులకు అవకాశాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరిగి అభివృద్ధి వుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, బంధుమిత్ర వర్గంతో సత్సంబంధాలు నెలకొంటాయి. కొత్త పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. కుటుంబ సౌఖ్యం, ప్రముఖులతో పరిచయాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి పెరుగుట, మంచి ఆర్ధికాభివృద్ధి అవకాశాలు లభించడం జరుగుతుంది. తొందరపాటు మాటలు, ప్రవర్తన లేకుండా జాగ్రత్తపడండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా వుంటాయి. వ్యవహారాలలో మీకు మంచి విలువ వుంటుంది. కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులు, ఇతరులతో జాగ్రత్తగా మెలగండి. వ్యాపారులకు, ఉద్యోగులకు అధికారుల వత్తిడి వుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. కుటుంబంలో కొంత అనుకూలత లేకున్నా సర్దుబాటు చేసుకుంటారు. ఖర్చులు అధికంగా వుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. ఇతరుల పనుల మీద ప్రయాణాలుంటాయి. నిరుద్యోగులకు మంచి అవకాశాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. కాంట్రాక్టు పనులు, గృహనిర్మాణ పనులు నిదానంగా సాగుతాయి. అనవసర ఖర్చులు తప్పవు. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్ధిక లావాదేవీలు ఉత్సాహపరుస్తాయి. స్థిరాస్తుల కొనుగోలు జరుగవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు తమ అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగాలి. శుభకార్యాలలో పాల్గొంటారు. అదనపు ఖర్చులు తప్పనిసరిగా వుంటాయి. ఆహ్వానాలు, నోటీసులు అందుకుంటారు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. విద్యాప్రగతి బాగుంటుంది. కుటుంబసౌఖ్యం కలదు. పనులు సక్రమంగా సానుకూలంగా జరుగుతాయి. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి.

# రాహుల్‌ను సత్కరించిన కాంగ్రెస్ నేతలు

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్‌జనపథ్... అప్పుడే 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఫలితాలు వచ్చాక కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడ ఆనందోత్సాహాలతో భల్లే.. భల్లే... అంటూ చిందులు వేస్తున్నారు. రంగులు చల్లుకుంటున్నారు. స్వీట్లు పంచుకుంటూ ఔట్లు పేల్చుకుంటున్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, యువరాజు రాహుల్‌గాంధీ, మాజీప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ నేతలు అంబికాసోని, గులాంనబీ ఆజాద్, అహ్మద్‌పటేల్, మల్లిఖార్జున్ ఖర్గే తదితరులు ఆ సంబరాలలో పాల్గొన్నారు. ఆ వేడుకలన్నీ కూడా పంజాబ్ కాంగ్రెస్ నేతలు అమరీందర్‌సింగ్, నవజ్యోత్‌సింగ్ సిద్దూల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. పంజాబ్ కాంగ్రెస్ నేతలైతే యువరాజు రాహుల్ గాంధీని భుజాలమీదకెత్తుకుని... 'రాహుల్ జిందాబాద్... రాహల్ జిందాబాద్' అంటూ పెద్దఎత్తున జిందాబాద్‌లు కొడుతున్నారు.

★★★★★

ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కూర్చుని ప్రధాని నరేంద్రమోడీతో పాటు కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, అనంతకుమార్ 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను చూస్తున్నారు. అయితే ఓ పక్క ఎన్నికల ఫలితాలను ప్రసారం చేస్తున్న న్యూస్ ఛానెల్స్ స్క్రీన్‌పై ఇంకో బాక్స్‌లో టెన్‌జనపథ్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలను కూడా ప్రసారం చేయసాగాయి. అది చూసి మోడీతో పాటు కేంద్రమంత్రులు కూడా ఖంగు తిన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వస్తున్న బంపర్ మెజార్టీలు వీళ్ళకు ఆనందాన్నివ్వడం లేదు. టెన్‌జనపథ్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు జరుపుకుంటున్న సంబరాలతో వీరి సంతోషం తుడిచి పెట్టుకుపోయింది. మోడీ ముఖం అయితే మాడిపోయింది. మనం గెలిచాం, అయినా ఆనందం లేకుండా పోయింది. వాళ్ళు ఓడినా సంబరాలు చేసుకుంటున్నారు. ఆ మర్మమేంటో పసిగట్టాలని మోడీ బాధతో చెప్పాడు. అంతలో టీవీ స్క్రీన్ మీద టెన్‌జనపథ్ సంబరాలలో ఫ్లాష్ న్యూస్ ఒకటి రాసాగింది. ఈ సాయంత్రం పంజాబ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీకి సన్మానం అని వస్తుంది. అది చూసి బీజేపీ నాయకులు మరింత షాక్‌కు గురయ్యారు. మనం నాలుగు రాష్ట్రాల్లో మంచి ఫలితాలు సాధించినా మనం అంత ఎంజాయ్ చేయలేకపోతున్నాం, కాని ఒక్క రాష్ట్రంలో గెలుపుతోనే వాళ్ళు అంత బాగా ఎంజాయ్ చేస్తున్నారు, దీనికి లాజిక్ ఏదో వుంది... సాయంత్రం (వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్‌లనుద్దేశించి) మీరు రాహుల్ సన్మాన సభకు మారువేషాల్లో వెళ్లండి, ఆ లాజిక్ ఏంటో కనుక్కోండని నరేంద్రమోడీ పురమాయించాడు.

★★★★★

ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పంజాబ్ కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ సన్మానసభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభకు వచ్చిన వాళ్ళందరికీ తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు వి. హెచ్. హనుమంతరావు, మధుయాష్కీలు జ్యూస్‌లు, కాఫీలు అందిస్తున్నారు. వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్‌లు తలకు పాగా, కృపాణం ధరించి సిక్కుల వేషంలో వచ్చి కూర్చున్నారు. సోనియా, రాహుల్, మన్మోహన్‌సింగ్‌లు అప్పుడే వచ్చారు. నవజ్యోత్‌సింగ్ సిద్దూ ఆధ్వర్యంలో సన్మానసభ మొదలైంది. సభా ప్రాంగణమంతా పంజాబ్ సిక్కు కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయింది. తొలుత సిద్దూ అధ్యక్షోపన్యాసం చేస్తూ... ఈరోజు పంజాబ్‌లో కాంగ్రెస్ విజయం సాధించిందంటే అది నేను కాంగ్రెస్‌లో చేరబట్టో లేక ప్రభుత్వ వ్యతిరేకత వల్లనో కాదు, మన రాహుల్‌బాబు దయవల్లే గెలిచామన్నాడు. ఆ మాటకు అందరూ చప్పట్లు కొట్టారు. రాహుల్ దయ ఏంటో అర్ధం కాక వెంకయ్య, రాజ్‌నాథ్‌సింగ్‌లు తల పాగాలు గోక్కున్నారు. తర్వాత సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, అంబికాసోని, దిగ్విజయ్‌సింగ్, మల్లిఖార్జునఖర్గే, గులాం నబీ ఆజాద్‌లు కూడా మాట్లాడారు. అందరూ రాహుల్ పుణ్యానే పంజాబ్‌లో కాంగ్రెస్ విజయం సాధించగలిగిందని, ఈ సన్మానానికి ఆయన పూర్తి అర్హుడని చెప్పారు. చివరగా పంజాబ్ ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డ అమరీందర్‌సింగ్ మాట్లాడుతూ... ఈరోజు నేను తిరిగి పంజాబ్ ముఖ్యమంత్రిని కాగలుగుతున్నానంటే దానికి కారణం రాహుల్ బాబే... ఆయన మాపై చూపిన దయ అన్ని రాష్ట్రాల్లోని కాంగ్రెస్ నాయకులపై చూపించాలి. ఆయన పంజాబ్‌ను చూసినట్లుగానే అన్ని రాష్ట్రాలను చూస్తే దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమంటూ ప్రసంగం ముగించాడు. అమరీందర్ సింగ్ మాటలకు వెంకయ్య, రాజ్‌నాథ్‌లకు పిచ్చెక్కినట్లయ్యింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ఓటమితో ఈ కాంగ్రెసోళ్ళకు మెంటలొచ్చినట్లుంది... లేకపోతే ఈ సభలేంటి, రాహుల్‌కు ఆ సత్కారాలేంటి అని రాజ్‌నాథ్ అన్నాడు. అందుకు వెంకయ్య... వాళ్ళకు మెంటల్ కాదు, ఇందులో ఏదో లాజిక్ వుంది. కాంగ్రెస్ నాయకులను అంత తక్కువగా అంచనా వేయకూడదు. ఆ లాజిక్ ఏమిటో మనం కనిపెట్టాలన్నాడు. అప్పుడే రాహుల్‌కు శాలువాలు, పూలదండలు కప్పి సన్మానించి కాంగ్రెస్ నేతలందరూ ఇళ్లకు బయల్దేరారు. సిక్కుల రూపంలో వున్న వెంకయ్య, రాజ్‌నాథ్‌లు విలేకరుల మాదిరిగా చేతిలో పుస్తకాలు, పెన్నులు పెట్టుకుని అమరీందర్ సింగ్ వద్దకు వెళ్లారు. సార్, అసలు ఈరోజు రాహుల్‌ను ఎందుకు సన్మానించినట్లు? పంజాబ్‌లో కాంగ్రెస్ విజయానికి ఆయనకు సంబంధమేంటి? అని వెంకయ్య ప్రశ్నించాడు. మారువేషాల్లో వున్న వీళ్ళను పసిగట్టని అమరీందర్ వారితో... ఆఫ్ రికార్డ్‌గా మీకొక రహస్యం చెబుతా వినండి... మా రాహుల్‌బాబు ఏ రాష్ట్రం మీద ఎక్కువగా దృష్టిపెడితే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అంత ఎక్కువగా తుడిచిపెట్టుకుపోతుంది. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆయన ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల మీద ఎక్కువగా దృష్టిపెట్టారు. కాబట్టే అక్కడ కాంగ్రెస్ అడ్రస్ గల్లంతయ్యింది. దయామయుడు, మహానుభావుడు రాహుల్ మా పంజాబ్ గురించి పెద్దగా పట్టించుకోలేదు. కాబట్టే ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. మీకు సెంటిమెంటల్ లాజిక్ ఒకటి చెబుతాను వినండి... ఏ రాష్ట్రంలోనన్నా బీజేపీని అధికారంలోకి తేవాలంటే ప్రధాని మోడీ కాళ్ళకు బలపాలు కట్టుకుని తిరగాలి, అదే ఏ రాష్ట్రంలోనన్నా కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలంటే మా రాహుల్ బాబు... అక్కడ కాలు పెట్టకుండా ఉంటే చాలు. చాలా సింపుల్‌గా మేం గెలిచేస్తాం... మా లాజిక్ భలేగా వుంది కదూ... భల్లే భల్లే అని ఎగురుకుంటూ అమరీందర్ వెళ్ళిపోయాడు. అతని లాజిక్ విని వెంకయ్య, రాజ్‌నాథ్‌లు అలాగే నోర్లు తెరిచారు.

## కళ్యాణ వైభవం...!



టిపిగూడూరు మండలం వరిగొండ గ్రామంలోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం ఛైర్మన్ సోమన శ్రీనివాసులురెడ్డి - సుచిత్రల కుమారుడు శరణ్‌కుమార్‌రెడ్డి - సంధ్య (గూడూరు వాస్తవ్యులు పల్లంరెడ్డి శివకుమార్‌రెడ్డి - సుదర్శనమ్మల కుమార్తె)ల వివాహం ఈ నెల 8వ తేదీ గూడూరులోని దివ్య ఫంక్షన్‌హాల్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త దోరడ్ల కృష్ణమూర్తి - సునీతల కుమారుడు పవన్ కుమార్ - నీరజ (అమరా మల్లిఖార్జున - భవానిల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 5వ తేదీ నెల్లూరులోని డిఆర్ సెంట్రల్ హోటల్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.


# అయ్యప్ప ఆలయంలో వైభవంగా కుంభాభిషేకం

## కలశాభిషేకంలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు



నెల్లూరు వేదాయపాలెం లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఐదు రోజుల పాటు జరిగిన ద్వితీయ కుంభాభిషేకాలు బుధవారం వైభవంగా ముగిసాయి. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్పకు 1001 కలశాల అభిషేకం, శ్రీ గురువాయూర్ మహావిష్ణువుకి శతకలశాభిషేకం, కుంభాభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ఉదయం అయిదు గంటలకు నిర్మాల్యదర్శనం, మహాగణపతి హోమం, ఉష:పూజలు జరిగాయి. అనంతరం వళియపాణి, బ్రహ్మకలశాభిషేకం, సహస్ర కలశాభిషేకం, ఉచ్చపూజ, అవస్థాన ఘోషణం, శ్రీభూతబెలి, ఆచార్య దక్షిణ తదితర పూజలు జరిగాయి. గురువాయూర్ మహావిష్ణువు ఆలయంలో శతకలిశ స్థాపన, శత కలశాభిషేకం, శాత్తుమొర్రై, ఘెష్టిలు జరిగాయి. అనంతరం అయ్యప్పస్వామికి దాదాపు టన్నుకుపైగా వివిధ సుగంధ పుష్పాలతో కన్నుల పండువగా పుష్పాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలు వ్యవహరించారు. వీరు స్వయంగా పుష్పాలు అందజేసి అర్చకస్వాముల చేత మూలవర్లకు అభిషేకాలు చేసారు. ముఖ్యఅతిథులుగా మాజీఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొని అభిషేకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా శ్రీ వైష్ణవి కోలాట బృందం, శ్రీనివాస కోలాట బృందం కళాకారులు ప్రదర్శించిన కోలాటం, కేరళ నుంచి వచ్చిన వాయిద్య బృందంల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కుంభాభిషేకం, కలశాభిషేకం పూజల్ని కేరళ నుంచి వచ్చిన వడకెత్తు పెరుంబడప్పు మనకేశ్వన్ నంబూద్రి తంత్రి ఆధ్వర్యంలో కేరళ తంత్రీల బృందం నిర్వహించింది. ఈ వేడుకల్ని ఆలయ ఛైర్మన్ పి.టి.రంగరాజన్, కార్యదర్శి జి.వి.శేషగిరిరావు, కె.వి.రత్నం, గునుపాటి వెంకటకృష్ణారెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, బొమ్మిశెట్టి నాగేశ్వరరావు, బాలుస్వామి, కె.జి.శంకరన్, ఎస్.రమణయ్య పర్యవేక్షించారు. భక్తులకు కలిశాలు అన్నప్రసాద పంపిణీ జరిగింది.

# భక్తుల ఆనందోత్సాహాలతో రథోత్సవం



నెల్లూరు రంగనాయకుల పేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. జై రంగా... జై జై రంగా... గోవిందా గోవిందా... అంటూ వేలాది మంది భక్తులు చేసిన నినాదాలతో నగర వీధులు మార్మోగాయి. తొలుత ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, అర్చక బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథునికి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, యాత్రాదానం చేశారు. అనంతరం స్వామివారిని ఉభయదేవేరులతో రథంపై ప్రతిష్ఠింప జేశారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్, విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆలయ ఛైర్మన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ గుమ్మడికాయతో దిష్టి తీసి, రథాన్ని ప్రారంభించారు. వేలాదిగా భక్తులు జైరంగా అంటూ గోవింద నామస్మరణలతో రథాన్ని లాగారు. తొలుత పెన్నా ముఖంగా బయలుదేరి రాజగోపుర తూర్పు వీధిలో రైల్వేగేటు వరకు వెళ్ళి తిరిగి గోపురం వీధి గుండా రంగనాయకులపేట, సంతపేట సెంటర్, నాలుగుకాళ్ళ మండపం వరకు రథం వచ్చింది. భక్తులు మిరియాలు, ఉప్పు రథంపై చల్లి మొక్కులు సమర్పించుకున్నారు. సంతపేట సెంటర్‌లో మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తన కుటుంబసభ్యులతో స్వామివారికి ఎదురువెళ్ళి పూలు, పండ్లు, వస్త్రాలు సమర్పించి హారతి అందుకున్నారు. అనంతరం నరశింహకొండ నుంచి చెంచులక్ష్మి, మహాలక్ష్మి సమేత నరసింహస్వామి సంతపేటకు విచ్చేసి భక్తులకు దర్శనమిచ్చారు. రథంలో వున్న ఉభయదేవేరుల సమేత రంగనాథునికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. అలాగే రంగనాథస్వామి నరశింహస్వామికి పట్టు వస్త్రాలు పూలమాలలు సమర్పించారు. రథం వద్ద తొక్కిసలాట లేకుండా కృష్ణపట్నం పోర్టు సెక్యూరిటీ సిబ్బంది రోప్‌తో విధులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు.



# రిచ్‌లో న్యూబోర్న్ స్క్రీనింగ్ పరీక్ష

## • 18న ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్



నెల్లూరు పొగతోటలో వున్న రిచ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన న్యూబోర్న్ స్క్రీనింగ్ పరీక్షా విభాగాన్ని ఈ నెల 18వతేదీ శనివారం ఉదయం 10.30గంటలకు నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ప్రారంభించనున్నట్లు రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డా॥ టి.రవికుమార్ పేర్కొన్నారు. గురువారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నై కంచి కామకోటి చైల్డ్ హాస్పిటల్ ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డా॥ రాహుల్ ఆనంద్ పాల్గొంటారని తెలిపారు. ఇది పురిటిపిల్లల మొట్టమొదటి ఆరోగ్య రక్షణ పరీక్షని, పుట్టుకలో వచ్చే అవయవాలకు, ఎండోక్రైన్ గ్రంథులకు సంబంధించిన వ్యాధులు, జన్యుపరమైన వ్యాధులు బయటపడకముందే గుర్తించేందుకు చేసే పరీక్ష ఈ న్యూబోర్న్ స్క్రీనింగ్ ఫస్ట్ టెస్ట్ అని తెలిపారు. ఈ టెస్ట్ వల్ల 50రకాల జబ్బుల నుండి బిడ్డను రక్షించుకోవచ్చన్నారు. పుట్టినప్పటి నుంచి నెలరోజుల లోపల ఈ టెస్టును చేయించుకోవాలన్నారు. పాశ్చాత్య దేశాల్లో తప్పనిసరిగా పుట్టిన బిడ్డకు ఈ పరీక్షను నిర్వహిస్తారని తెలిపారు. ఈ టెస్టుకు దాదాపు రూ.5వేలు ఖర్చవుతుందని, ఈ నెల 18 నుండి నెలరోజుల లోపల కేవలం 1500 రూపాయలు ఖర్చులతో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ కంటిలోని రెటినా ఎదుగుదల, జన్యు సంబంధిత సమస్యలు, వినికిడి లోపాలు, మాటలు పలకడానికి నరాల శక్తిని గుర్తించే పరీక్ష, నోటి పరీక్ష, గుండె, మెదడు సమస్యలను ముందుగా గుర్తించే ఏకైక పరీక్షని తెలిపారు. ఈ అవకాశాన్ని సింహపురీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డా. గంగిశెట్టికి 'బాలసాహితీ భూషణ్' అవార్డు



నెల్లూరుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన 'బాలసాహితీ భూషణ్' అవార్డు లభించింది. విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన మంచిపల్లి సేవా ట్రస్ట్ నుంచి ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. అక్కడి ప్రముఖ విద్యావేత్త డా. మంచిపల్లి శ్రీరాములు తన భార్యపేరిట మంచిపల్లి సేవా ట్రస్ట్ ఏర్పాటుచేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. బాలసాహిత్యం మీద మక్కువతో ప్రతి ఏటా ఒక బాలసాహితీవేత్తను ఎంపికచేసుకుని, వారికి అయిదువేల రూపాయల నగదు బహుమతినిచ్చి, బాలసాహితీ భూషణ్ అవార్డును ప్రదానం చేస్తుంటారు. ఈఏడు ఆ పురస్కారం డా. గంగిశెట్టికి లభించింది. ఏప్రిల్ 2వ తేదిన పార్వతీపురంలో జరిగే సభలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. డా.గంగిశెట్టి శివకుమార్ 'తెలుగులో బాలల కథలు' అనే అంశంపై పిహెచ్‌డి చేశారు. బాలసాహితీ భూషణ్ అవార్డునందుకుంటున్న డా. గంగిశెట్టి శివకుమార్‌కు 'లాయర్' శుభాకాంక్షలు.

# గ్లకోమా వ్యాధిపై అవగాహన ర్యాలీ




ప్రపంచ నీటి కాసుల వ్యాధి(గ్లకోమా) నిర్మూలనా వారోత్సవాల్లో భాగంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ నేత్ర వైద్య కేంద్రం వారు ఆదివారం ఉదయం నెల్లూరు సర్దార్ వల్లభాయ్‌పటేల్‌నగర్‌లోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రాథమిక నేత్ర వైద్య కేంద్రం నుండి ఏసి సుబ్బారెడ్డి ప్రాంగణం వరకు నీటి కాసుల వ్యాధి గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5వ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మంగారావు మాట్లాడుతూ ప్రజలు గ్లకోమా లాంటి కంటి వ్యాధుల గురించి ముందుగా తెలుసుకుని అప్రమత్తంగా ఉండి కంటిచూపును కాపాడుకోవాలన్నారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అడ్మినిస్ట్రేటర్స్ పి.ప్రవీణ్, ఆనంద్ దువ్వూరి మాట్లాడుతూ వెంకటాచలంలోని తమ ద్వితీయ నేత్ర వైద్య కేంద్రంలో అన్ని క్లిష్టమైన కంటి సమస్యలకు ప్రపంచ స్థాయి వైద్యం, పేద ప్రజలకు అందుబాటులో ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. నెల్లూరుజిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ అనుబ్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# బడ్జెట్టు... కనికట్టు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన నవ్యాంధ్ర తొలి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చూసి ఎవరైనాసరే ఆశ్చర్యపోవాల్సిందే. అయితే, ఆచరణకొచ్చేసరికి ఖర్చుపెట్టేది అంతంతమాత్రమేనన్నది వేరే విషయం. ఆ అరకొరా కూడా అసలైన లబ్దిదారులకు చేరుతున్నాయా అంటే అదీ లేదు. అంతా ఆర్భాటమే తప్ప, అభివృద్ధి మాత్రం వుండదు. చంద్రబాబు హైటెక్ బడ్జెట్ ఇలాగే వుంటుంది. ప్రాధాన్యతారంగాలకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యత లేదు. వ్యవసాయం, నీటి పారుదల, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం..వంటి రంగాలు ఇంకా నిధుల లేమితో విలవిలలాడుతూనే వున్నాయి. భారీ కేటాయింపులుంటే తప్ప ఈ రంగాల పరిస్థితి ఒక కొలిక్కి రాదు. అయినా, బడ్జెట్‌లో అంత కేటాయింపులు అసలే లేవు. ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు, బిసి సంక్షేమం వంటివి నేతిబీరలో నేయిలాగానే వుంటున్నాయి. వాటికి అవసరమైన నిధులు ఎప్పుడో అడుగంటిపోయాయి. నిధుల కోసం అడుగుతూనే వున్నా..'కాకి అరుస్తూనే వుంటుంది.. కరవాడ ఎండుతూనే వుంటుంది'..అన్న సామెతగా ఎన్నో కీలక రంగాలు మూలనబడి కుయ్యోమొర్రో అంటున్నాయి. బడ్జెట్ వస్తుంది.. కేటాయింపు వుంటుంది..కానీ అవసరమైన నిధులు మాత్రం వుండవు..ఒకవేళ వున్నా అవి అసలైన లబ్దిదారులకు అందవు. ఇదీ మన దుస్థితి. ఎన్ని బడ్జెట్‌లు వస్తున్నా ఇలాంటి తీరు మారదంలేదన్నదే సామాన్య ప్రజల ఆవేదన. కొత్తబడ్జెట్ కూడా ఇందుకు భిన్నమేమీ కాదు. మరీ యువతకైతే ఈసారి చుక్కలలోకం చూపించారు. నిరుద్యోగులకు ఆశపెట్టి, వారికి భృతి కల్పిస్తామని ఊరించి..ఎన్నికలప్పుడు భారీ ప్రచారాలు చేసుకున్న చంద్రబాబే ఇప్పుడు నిరుద్యోగుల విషయం పట్టించుకోవడం లేదు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అప్పటి దాకా రెండు వేల రూపాయల వంతున నిరుద్యోగభృతి కల్పిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మళ్ళీ నీటిమూటలే అయ్యాయి. నిరుద్యోగ భృతి కల్పించాలంటే రాష్ట్రంలో నెలకు కనీసం 3,500 కోట్లన్నా కావాలి. అయితే, అంత డబ్బెక్కడిదీ?.. లేదు కనుకనే నిరుద్యోగభృతి కింద ఓ 5వందల కోట్లిస్తామని ప్రకటించారు. కేటాయింపులైతే చేశారు కానీ, ఇవైనా సక్రమంగా ఆచరణకు వస్తాయన్న నమ్మకం లేదు. కేటాయించిన నిధులు లబ్దిదారులకు చేరుతున్నాయో...ఇతరుల జేబులు నింపుతున్నాయో అనే విషయం పట్టించుకునే నాధుడే కన్పించడం లేదు. అన్ని పథకాల పరిస్థితిని పర్యవేక్షించాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే పరిస్థితి వుండడం లేదు. కాలం గడిచిపోతున్నా ఆ హామీలు ఇప్పట్లో నెరవేరేలా లేదంటూ అటు యువతలోనూ, ఇటు ప్రజల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సకాలంలో జీతాలందితే చాలు..అదే పదివేలు అన్నట్లుంది ఉద్యోగుల పరిస్థితి. ఇకపోతే, అటు రైతులకు గానీ, ఇటు మహిళాలోకానికి గానీ ఆశించిన అభివృద్ధి అసలే లేదు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు వర్షాభావం వల్ల కరువుతో అల్లాడుతున్నా పట్టించుకునేవారే కరువు. బడ్జెట్‌లో అంతా ఊకదంపుడే తప్ప రైతులకు ఒరిగిందేమీలేదు. వేల కోట్ల రుణాల్లో 'రుణమాఫీ' అవుతోంది కూడా చాలా స్వల్పమే. వేలకోట్లల్లో వడ్డీని ఇంకా అన్నదాతలు అవస్థలు పడుతూ చెల్లించుకుంటూనే వున్నారు. రైతులకు పంట రుణాలు అసలే అందడం లేదు. నీటి పారుదల వసతులు మునుపటికన్నా ఘనంగా ఏమీ అభివృద్ధి చెందలేదు. ఉపాధి లేక రైతుకూలీలకు అవస్థలు తప్పడం లేదు. ప్రజలు పనుల్లేక ఊరిడిచిపెట్టి వలసపోతున్నారంటే, 'పనుల్లేక కాదు.. ఎక్కువ డబ్బు కోసం అలా వెళ్ళడం వారికి అలవాటేనని, మనవాళ్ళంతా కమర్షియల్‌గా వుంటారని' ముఖ్యమంత్రి అనడాన్ని ఏమని అర్థం చేసుకోవాలో?!.. గత ఏడాది బడ్జెట్‌లో బిసిల సంక్షేమం కోసమని 4430 కోట్లు కేటాయించారు కానీ, బిసిల స్థితిగతుల్లో మాత్రం ఎలాంటి మార్పూ వుండడం లేదు. అదే రకంగా అన్ని రంగాల్లోనూ వుంది. బడ్జెట్‌లో చెప్పేదొకటి..ఆచరణకొచ్చేదొకటి. మేడిపండు బడ్జెట్ అంటే ఇదిగో ఇదే.. అన్నట్లుగా వుంది. పేదలకు ఇళ్ళు నిర్మిస్తామని ఆశ పెడతారే తప్ప.. ఆ పథకమంతా అస్తవ్యస్తమే. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాన్నే ఇంకా ఖర్చుపెట్ట లేదు. ఇళ్ళ నిర్మాణాలు నత్తనడక నడుస్తున్నా పట్టించుకునేవారు లేరు. డ్వాక్రామహిళలకు రుణాలమాఫీ మాట కూడా ఉత్తుత్తిదే. 'చెప్పేవి గొప్పలు.. పెట్టేవి తిప్పలు' అన్నట్లుగా వుంటోంది చంద్రబాబు బడ్జెట్ తీరు. రుణాల మాఫీ అంటారు.. వడ్డీలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తారు. ఇదన్నమాట అభివృద్ధి అంటే. ఇక మహిళాభ్యుదయం..మహిళా సాధికారత వంటి అంశాలన్నీ ఉపన్యాసాలకే పరిమితాలన్నది బహిరంగ రహస్యమే. ఇలా 'లోపాల కారి'గా వుండడం వల్లనే బడ్జెట్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు. బడ్జెట్ అనగానే అది తమకు సంబంధించిన అంశం కాదన్నట్లుగా వుండే ధోరణి ప్రజల్లో ప్రబలడానికి పాలకులు అనుసరిస్తున్న ఇలాంటి విధానాలే కారణం. అందులోనూ మన చంద్రబాబు మాటలకైతే అసలు హద్దులే వుండవు. మాటలు కోటలకోట్లు దాటుతుంటాయే తప్ప, అడుగు మాత్రం అంగుళం కూడా ముందుకు పడదు. ప్రజాధనం సద్వినియోగం చేయాలన్న ధ్యాసే వుండకపోవడం, చిత్తం వచ్చిన రీతిలో కేటాయింపులు చేసేసుకోవడం, నిధుల కేటాయింపులు-వ్యయం పట్ల ఖచ్చితమైన పరిశీలన-పర్యవేక్షణ యంత్రాంగం లేకపోవడం, చివరికి ప్రజలకిచ్చిన హామీలకు గానీ, ప్రజల మాటకు గానీ అసలు విలువలేకపోవడం వంటివన్నీ ఇందుకు ప్రధాన కారణాలు. 'రాష్ట్ర ప్రగతి.. ప్రజల అభ్యున్నతి'.. మాటల్లోనే తప్ప చేతల్లో చూపలేని నాయకులున్నంత కాలం ఇలాంటి బడాయి బడ్జెట్‌లు ఎన్నొచ్చినా ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నది సర్వత్రా జనాభిప్రాయం.

# మనస్ఫూర్తిగా పని చేశారా?

(5వ పేజీ తరువాయి)

అంతర్గత కుమ్ములాటలు మొదలయ్యాయి. అలాగే మరో నాయకుడు గంగాప్రసాద్‌కు వాకాటికి అంతగా పడదు. ఇక ఆదాల ప్రభాకర్‌రెడ్డి చూస్తే ఎమ్మెల్సీ సీటు విషయంలోనే వాకాటితో పోటీపడ్డాడు. తనకు రాని టిక్కెట్‌ను వాకాటి తెచ్చుకున్నాడు. ఆదాల కూడా ఆయన కోసం ఇష్టపూర్వకంగా పనిచేయలేదు. ఎంతటి రాజకీయాలైనా అన్నదమ్ముల మధ్య రక్త సంబంధంకు ప్రాధాన్యత వుంటుంది. అవతల వైసిపి అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి, ఇవతల ఆయన ముగ్గురు అన్నలు ఆనం వివేకానందరెడ్డి, రామనారాయణరెడ్డి, జయకుమార్‌రెడ్డిలు తెలుగుదేశంలో వున్నారు. వాకాటికి వీళ్ళకు మధ్య ఎటువంటి బంధం లేదు. విజయకుమార్‌రెడ్డిది రక్తసంబంధం. ఈ స్థితిలో వాళ్ళు కూడా మనసు చంపుకుని వాకాటికి పనిచేయాల్సి వచ్చింది. కేవలం చంద్రబాబు భయంతో కొందరు, పార్టీ నిబద్ధతతో కొందరు వాకాటి కోసం పని చేశారు తప్పితే పార్టీలో అతని కోసం నిబద్ధతగా పనిచేసిన వాళ్ళను వేళ్ళ మీద లెక్కపెట్టొచ్చు.

# న(వ)మో భారత్

(మొదటి పేజీ తరువాయి)

సంపన్న కుటుంబం. భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ఆర్థిక తోడ్పాటునందించారు. మహాత్మాగాంధీ పోరాటానికి అండగా నిలిచారు. కాబట్టే స్వాతంత్ర్యం వచ్చాక గాంధీజీ కాంగ్రెస్‌పార్టీని, భారతదేశాన్ని నెహ్రూ చేతిలో పెట్టాడు. దాంతోపాటే 'గాంధీ' అన్న బ్రాండ్ ఇమేజ్‌ను కూడా నెహ్రూ కుటుంబానికి ధారాదత్తం చేశారు. కాంగ్రెస్సే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిందన్న ఓ భావన, అలాగే గాంధీ బ్రాండ్ ఇమేజ్ నెహ్రూను దేశ రాజకీయాలలో శక్తివంతునిగా నిలిపాయి. ఆయన తర్వాత రాజకీయ వారసురాలిగా వచ్చిన ఇందిరాగాంధీ కూడా అత్యంత శక్తివంతురాలైన నాయకురాలిగా ఎదిగారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజల ఆదరాభిమానాలు పొందారు. అయితే ఇందిరమ్మకు నెహ్రూ రాజకీయ వారసత్వమనే ఒక పునాది వుంది. అందుకు చివరన వున్న 'గాంధీ' అన్న పేరు కూడా వుంది. వీళ్ళిద్దరు కూడా వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని శక్తివంతమైన నేతలు కాగలిగారు. అయితే భారత రాజకీయాలలో అవకాశాలను ఉపయోగించుకుని కాదు, అవకాశాలను సృష్టించుకుని దేశమంతా ప్రభంజనం సృష్టించిన అత్యంత శక్తివంతమైన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతాడు ప్రధాని నరేంద్ర మోదీ! నిజంగా ఆయనొక చరిత్ర. ఆయన రాజకీయ ప్రస్థానం ఓ అద్భుతం. ఆయన వెనుక సంపన్న కుటుంబం లేదు, తల్లిదండ్రులు స్వాతంత్ర్య సమరయోధులు కారు, గాంధీజీ వంటి మార్గదర్శకులు లేరు. అయినా ఈరోజు దేశ రాజకీయాలను శాసిస్తున్నాడు. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చాడు. ఆయన కుటుంబసభ్యులు ఇప్పటికీ సాదాసీదా పనులే చేసి బ్రతుకుతున్నారు. ఆయనకు బడైనా గుడైనా ఆరెస్సెస్ కార్యాలయమే! క్రమశిక్షణతో కష్టపడడం, పోరాడడం, నిజాయితీగా నిలబడడం, సమస్యలను ఎదుర్కోవడం అక్కడ నుండే నేర్చుకున్నాడు. బీజేపీలో ఒక సాధారణ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి, ఆ తర్వాత పార్టీలో వివిధ హోదాలలో పని చేశారు. గుజరాత్‌లో కచ్, భుజ్ ప్రాంతాలలో భూకంపాలు వచ్చినప్పుడు, సంక్షోభంలో వున్న ఆ రాష్ట్రాన్ని ఆదుకోవడానికి బీజేపీ అధిష్టానం ఆయనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పంపింది.

అంతే... అక్కడ నుండి ఆయన వెనుతిరిగి చూసింది లేదు. ముఖ్యమంత్రిగా తన నాయకత్వంలో మూడుసార్లు గుజరాత్‌లో బీజేపీని గెలిపించాడు. 2014 ఎన్నికల్లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా దేశమంతా తానే అయ్యి ప్రచారం చేశాడు. భారత దేశంలోనే కాదు, ప్రపంచమంతటా కూడా మోడీ మానియాను సృష్టించాడు. 2014 ఎన్నికల్లో మోడీది ప్రభంజనమే! 337 సీట్లతో ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. 1984లో ఇందిరాగాంధీ హత్య తర్వాత వచ్చిన ఎన్నికల్లో ఆమె సానుభూతి పవనాలతో కాంగ్రెస్ 400కుపైగా సీట్లు గెలిచింది. అది కేవలం గాలివాటం గెలుపు. కాని 2014లో మాత్రం దేశ ప్రజలు కేవలం మోడీ అనే ఓ శక్తి మీద నమ్మకంతోనే అన్ని సీట్లిచ్చారు.


ఆ ఎన్నికల ద్వారానే మోడీ అంటే ఏమిటో అర్థమైపోయింది. ఆ తర్వాత ఢిల్లీ, బీహార్ ఎన్నికల ద్వారా ఎదురుదెబ్బలు తగిలినా వాటి నుండి తేరుకోవడానికి మోడీకి ఎక్కువ సమయం పట్టలేదు. నిన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే ఇందుకు ఉదాహరణ. ముఖ్యంగా దేశానికి పెద్దదిక్కులాంటి ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి 325సీట్లు వస్తాయని ఆ పార్టీ వాళ్ళే అంచనా వేయలేకపోయారు. యూపీలో ఏ పార్టీకీ మెజార్టీ రాదన్న మీడియా సర్వేలన్నీ కూడా పటాపంచలయ్యాయి. 403 సీట్లున్న యూపీలో 325సీట్లు బీజేపీకి దక్కడం ఒక చరిత్ర. అంతకుముందు నెహ్రూ, ఇందిరల హయాంలోనే కాంగ్రెస్‌కు ఇన్ని సీట్లు వచ్చాయి. అది కూడా అప్పుడు ఉత్తరప్రదేశ్ విభజన జరగలేదు. 525 అసెంబ్లీ సీట్లుండేవి. ఆ విజయాలతో పోలిస్తే, నేటి మోడీ విజయం చాలా గొప్పది. ఎందుకంటే ఈ ఎన్నికల్లో ఆయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. పెద్దనోట్లు రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయం తర్వాత జరిగిన ఎన్నికలివి. దేశంలోని మిగతా పక్షాలన్నీ పెద్దనోట్ల రద్దును వ్యతిరేకించాయి. మోడీ చర్యపై విమర్శలు గుప్పించాయి. ప్రజలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రచారం చేసాయి. కాబట్టి మోడీ నాయకత్వ సమర్థతకు ఈ ఎన్నికలు ఒక పరీక్షగా నిలిచాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతే ఆ పార్టీలో మోడీ మీదే వ్యతిరేకత, మోడీ పీఎం సీటుకే ఎసరొచ్చే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ఎన్నికల్లో మోడీ తన సత్తా చాటాడు. ఒక ప్రధానిగా కాదు, పార్టీ ప్రచారకర్తలా పనిచేశాడు. యూపీ మొత్తం తానే అన్నట్లు పని చేశాడు. ఓ పక్క మోడీని నిలువరించడానికి సమాజ్‌వాదీ కాంగ్రెస్‌తో జతకట్టింది. ఇంకో పక్క బీఎస్పీ దళిత ఓటు బ్యాంకు ప్రయోగాలు చేసింది. కుల రాజకీయాలకు కేంద్రబిందువైన యూపీలో మిగతా పార్టీలన్నీ కులం కార్డులను బాగానే ప్రయోగించాయి. మోడీ మాత్రం అభివృద్ధి కార్డును ప్రయోగించారు. పరోక్షంగా 'హిందుత్వ'కార్డును కూడా బయటకు తీసారు. దాని ఫలితంగానే యూపీలో చారిత్రాత్మక విజయం సొంతమైంది. ఒక్క యూపీలోనే కాదు, ఉత్తరాఖండ్‌లో అఖండ విజయం కూడా మోడీ ఇమేజ్‌ను పెంచాయి. అదే సమయంలో మణిపూర్, గోవాలలో ప్రభుత్వం ఏర్పాటుకు చాలినన్ని సీట్లు లేకున్నా అప్పటికప్పుడు లౌక్యంగా వ్యవహరించి ఇతర పక్షాల మద్దతుతో అక్కడ ప్రభుత్వాలను ఏర్పాటు చేయించిన మోడీ చాణక్యం కూడా ఆయన తిరుగులేని నాయకత్వ పటిమకు నిదర్శనం. కష్టపడి ఎదగాలనుకునే వారికి, నిజాయితీగా వుంటూ దేశ రాజకీయాలను శాసించాలనుకునే వారికి, నిబద్ధతతో వున్నా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత స్థానం అందుకోవాలనుకునే వారికి 'మోడీ' చరిత్ర ఒక అధ్యయన గ్రంథమే! ఆచరించదగ్గ మార్గమే!

# నంద్యాల 'ఉప'ద్రవం!

(మొదటి పేజీ తరువాయి)

కాకపోతే కనీసం సానుభూతి కూడా పనిచేయదు. ఇక 2014 ఎన్నికల్లో నాగిరెడ్డి మీద పోటీ చేసి ఓడిపోయిన శిల్పామోహన్‌రెడ్డిని దించాలి. ఆయనను దించితే భూమా వర్గీయులు పనిచేయరు. ఇక ప్రభుత్వ వ్యతిరేకత బలంగా పనిచేస్తోంది. ఒకవేళ శిల్పా మోహన్‌రెడ్డికి తెలుగుదేశం సీటివ్వకపోతే, ఆయనను తమ పార్టీ అభ్యర్థిగా నిలబెట్టడానికి వైకాపా రెడీగావుంది. మారిన పరిస్థితుల్లో భూమా మృతి పట్ల కూడా పెద్దగా సానుభూతి వచ్చే అవకాశం లేకపోవడం తెలుగుదేశంకు ఇబ్బందికర వాతావరణమే! కర్నూలుజిల్లాలో వైకాపా బలంగా ఉండడం, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఇంకా పెరుగుతుండడం, కోట్ల కుటుంబం వైకాపాలో చేరుతుండడం, తెలుగుదేశంపై కె.ఇ.సోదరులు అసంతృప్తిగా ఉండడం వంటి పరిణామాలన్నీ వైకాపాకు కలిసొచ్చేవే!

# రాష్ట్రపతిగా... 'కమల' దళపతి?



***ఈరోజు దేశ రాజకీయాలలో మారిన చరిత్రను చూస్తున్నాం. పతనం అంచుల్లో వున్న నూటపాతికేళ్ళ కాంగ్రెస్‌పార్టీని చూస్తున్నాం. దేశం నలుచెరుగులా విస్తరిస్తున్న భారతీయ జనతాపార్టీని చూస్తున్నాం. దేశ చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన రాజకీయ ప్రజాకర్షణ నేతగా ఎదిగిన ప్రధాని నరేంద్రమోడీని చూస్తున్నాం. ఒకప్పుడు కేవలం ఉత్తరభారత పార్టీగానే ముద్రపడ్డ బీజేపీ నేడు దక్షిణ రాష్ట్రాలలోనే కాదు ఈశాన్య రాష్ట్రాలలో సైతం అధికారాన్ని చెలాయించడం చూస్తున్నాం. భారతదేశంలో 15 రాష్ట్రాలలో ఈరోజు కమలం జెండా ఎగురుతుండడం చూస్తున్నాం.***

ఈరోజు ప్రధానిగా నరేంద్రమోడీ శక్తివంతమైన నేతగా ఎదిగినా, 15రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో వున్నా... దానికి ప్రధాన కారణం పునాదులను బలంగా వేసి ఉండడం. ఆ పునాది వేసిన శక్తులు బలంగా ఉండడం. అలాంటి శక్తులు బీజేపీలో రెండే రెండు... ఒకరు అటల్ బిహారీ వాజ్‌పేయి అయితే రెండో శక్తి లాల్‌కిషన్ అద్వానీ! జనసంఘ్ నుండి భారతీయ జనతాపార్టీగా రూపాంతరం చెందిన బీజేపీకి ఈ ఇద్దరు అగ్రనాయకులు రెండుకళ్ళయ్యారు. ఒకరిది మితవాద ధోరణి, ఇంకొకరిది అతివాద ధోరణి అయినా పార్టీకి జోడెద్దులుగా మారి బండిని ముందుకు కదిలించారు.

భారతీయ జనతాపార్టీ ప్రస్థానంలోనూ ప్రయాణంలోనూ వీరిద్దరి పాత్ర చిరస్మరణీయం. అయితే వీరిలో వాజ్‌పేయి 1998 నుండి 2004 వరకు ప్రధాన మంత్రిగా పని చేశారు. అయితే పార్టీని రెండు సీట్ల నుండి రెండొందల సీట్లకు పెంచిన అద్వానీకి మాత్రం ప్రధాని పీఠం కలగానే మిగిలిపోయింది. 2004, 2009 ఎన్నికల్లో బీజేపీకి వరుస పరాభవాలు అద్వానీ ప్రధాని కలను ఛిద్రం చేసాయి. అయితే అద్వానీ కృషి మాత్రం ఒకనాడు వాజ్‌పేయిని, నేడు నరేంద్రమోడీని ప్రధానులను చేయగలిగింది.

ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ సాధించింది కేవలం రెండు లోక్‌సభ సీట్లే! అలాంటి పార్టీ తలరాతను మార్చింది అద్వానీనే! అయోధ్య రామమందిర బాణాన్ని ఎక్కుపెట్టాడు. అయోధ్యలో రామమందిరం నిర్మాణాన్ని తమ ఎన్నికల అజెండాగా మార్చుకుని 1989 ఎన్నికల్లో పార్టీకి అనూహ్యంగా 86లోక్‌సభ సీట్లు తెచ్చిపెట్టాడు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పాటైన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో బీజేపీని కీలక భాగస్వామిగా మార్చాడు. ఆ తర్వాత అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపట్టాలంటూ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఆయన జరిపిన రామరథయాత్ర దేశవ్యాప్తంగా మతకల్లోలాలను, రాజకీయ ప్రకంపనలను సృష్టించింది. అప్పుడే ప్రధానిగా వున్న వి.పి.సింగ్ బీహార్‌లో రథయాత్ర చేస్తున్న అద్వానీని అరెస్ట్ చేయించడం, ఫ్రంట్ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు ఉపసంహరించడంతో వి.పి.సింగ్ ప్రభుత్వం కూలిపోవడం, 1991లో మధ్యంతర ఎన్నికలు రావడం తెలిసిందే!

అప్పటి నుండి బీజేపీ అప్రహతహంగా ఎదగడం మొదలైంది. 1991, 1996లలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ధీటుగా సీట్లు సాధించిన బీజేపీ ప్రతిపక్ష హోదా సాధించింది. 1996లో తొలిసారి 200 మార్క్ సీట్లను అధిగమించింది. పూర్తి మెజార్టీ లేకున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వాజ్‌పేయి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే పార్లమెంటులో పూర్తి మెజార్టీ లేక 13రోజులకే పదవి నుండి దిగిపోయారు. 1998లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మిత్రపక్షాలను కలుపుకుని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వాజ్‌పేయి ప్రధానిగా వున్న ఆ ప్రభుత్వం 1999లో అన్నాడిఎంకె అధినేత జయలలిత మద్దతు ఉపసంహరణతో 13నెలలకే కుప్పకూలింది. ఆ ఏడాదే జరిగిన ఎన్నికల్లో బీజేపీ తిరిగి ఘనవిజయం సాధించి కేంద్రంలో తిరిగి అధికారపగ్గాలు చేపట్టింది. 1996, 1998, 1999లలో బీజేపీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మూడుసార్లు కూడా అద్వానీ తన సీనియర్ అయిన వాజ్‌పేయిని గౌరవించారు. ఆయన ప్రధాని కావడానికి ఏ మాత్రం అడ్డుపడలేదు. వాజ్‌పేయి వయసురీత్యా రాజకీయాల నుండి వైదొలిగాక జరిగిన 2004, 2009 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాలేకపోయింది. ఆ రెండు ఎన్నికల్లో ఎప్పుడు బీజేపీ గెలిచివున్నా అద్వానీయే ప్రధాని అయ్యుండేవాళ్ళు. 2014 ఎన్నికలనాటికి అద్వానీ పేరు తెరమరుగై, ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ తెరమీదకొచ్చారు. ఆయన పేరు మీదే ఎన్నికలు జరిగాయి. బీజేపీ చరిత్రలోనే ఎన్నడూలేని కనీవినీ ఎరుగని విజయం సాధించింది. కాబట్టి అప్పుడు ప్రధాని పదవి చేపట్టడానికి మోడీ అన్ని విధాలా అర్హుడే! ఒక విధంగా బీజేపీయే కాదు, నరేంద్రమోడీ ఈ స్థాయిలో ఈ స్థానంలో ఉండడానికి కారణం కూడా అద్వానీనే! అలాంటి గురువుకు పార్టీ అయినా, మోడీ అయినా కేంద్రమంత్రిలాంటి చిన్నపదవులను ఇచ్చి చిన్న బుచ్చలేరు. ఆ రాజకీయ యోధుడిని ఎలాగూ ప్రధానిని చేయలేకపోయారు. ఆయన స్థాయికి దేశంలో మిగిలివున్న ఏకైక పదవి భారత రాష్ట్రపతి. భారత దేశ ప్రధాని చేతులెత్తి నమస్కరించే అత్యున్నత స్థానం. ఆ స్థానంలో అద్వానీని కూర్చోబెడితే అది పార్టీకి గౌరవం, మోడీకి ఋణానుబంధం కూడా! ఇప్పటికే అద్వానీని రాష్ట్రపతిని చేయాలని బీజేపీ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. జూలైలో రాష్ట్రపతికి ఎన్నికలు జరుగనున్నాయి. మొన్న ఐదు రాష్ట్రాల ఎన్నికల విజయాలతో రాష్ట్రపతి ఎన్నికకు అవసరమైన ఓట్లు కూడా బీజేపీకి సమకూరాయి. అదీగాక అద్వానీ అభ్యర్థిత్వాన్ని దళ్(యు)టీఎంసి, అన్నాడిఎంకె వంటి పార్టీలు కూడా సమర్థించే అవకాశముంది. కాబట్టి అద్వానిని రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ ప్రకటిస్తే పోటీలేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం కూడా వుంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com